# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 14-04-2023 ₹15/-


# ఆర్థిక న్యాయానికి అద్భుత సూత్రం - జకాత్






మాతృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకం

ఉత్తమ నైతిక విలువలు నేర్పే ఉపవాసాలు



గీటురాయి
సహజీవన భావనల పావురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 45 సంచిక: 15 హైదరాబాద్
శుక్రవారం 14 ఏప్రిల్ 2023 రూ.15-00
22 రమజాన్ 1444 హిజ్రీ

**తొలిగీటు**

"ఇఫ్తార్ సమయంలో
ఉపవాసి చేసే
ప్రార్థనలన్నీ తప్పనిసరిగా
స్వీకరించబడతాయి"

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



14

# చరిత్ర నేర్పే పాఠాలు

## లోపల...

| | | |
|---|---|---|
| బహిష్కరణ | ...... | 04 |
| ఆర్థిక న్యాయానికి అద్భుత సూత్రం – జకాత్ | ...... | 05 |
| మాతృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకం | ...... | 08 |
| ఉత్తమ నైతిక విలువలు నేర్పే ఉపవాసాలు | ...... | 11 |
| తాత్విక ఆలోచనా విధానం నేర్పే గ్రంథం | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఘన విజయం | ...... | 20 |
| సంపదను శుద్ధపరిచేదే జకాత్ | ..... | 23 |
| కుటుంబం ప్రతీ మనిషి జన్మహక్కు | ...... | 24 |
| నదుల అనుసంధానం | ...... | 26 |
| కాలగమనం | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| విలువల వికాసమే ఉపవాసాల ఉద్దేశ్యం | ...... | 34 |

### ఊహల పల్లకిలో...




కూటమి నాయకుడు
కల్వకుంట్ల చంద్రుడు
అంటున్నరు కొందరు
తనే నంట ఇంద్రుడు!
ఎట్లుంటదో చూడాలి
అయ్యగారి జాతకం
తియ్యనైన ఈ ఊహ
అవుద్దేమో జ్ఞాపకం!!

*– యం.డి. ఉస్మాన్ ఖాన్*

# ఆలోచన

## బహిష్కరణ

ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తొమ్మిదేళ్ళ కాలంలో మొదటిసారి దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఒక్కటవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది.

ఈ పరిస్థితికి ముఖ్యమైన కారణం రాహుల్ గాంధీ. దేశంలోని అతి పాత పార్టీ. శతాబ్దకాల చరిత్ర ఉన్నపార్టీ, దేశంలో అతి పెద్ద ప్రతిపక్షం కాంగ్రెసు నాయకుడు రాహుల్ గాంధీని పార్లమెంటు నుంచి స్పీకర్ బహిష్కరించారు. ఈ సంఘటన ప్రతిపక్షాలన్నింటినీ ఏకం చేస్తోందిప్పుడు. మూడేళ్ళ క్రితం నమోదైన ఒక పరువునష్టం కేసులో గుజరాత్ రాష్ట్రంలోని ఒక దిగువ కోర్టు రాహుల్ గాంధీకి శిక్ష విధించిన వెంటనే పార్లమెంటు ఈ బహిష్కరణ నిర్ణయం తీసుకుంది.

ఈ కేసు విచారణ జరిగిన తీరు, శిక్ష విధించిన పద్ధతి మొదలైన వాటిపై చాలా చర్చ జరిగింది. చాలా విమర్శలు వచ్చాయి. పాలక పక్షం బీజేపీ తాను తలచుకుంటే ఏమైనా చేయగలనని చాటి చెప్పాలనుకుంటోంది. ఈ విషయం అర్థమైన ప్రతిపక్షాలు ఇప్పుడు ఒక్కటి కాకపోతే ప్రతిపక్షాలు మిగలవు.

రాహుల్ గాంధీపై తీసుకున్న చర్యలను అనేక పార్టీలు ఇప్పుడు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. నిజానికి ఈ పార్టీలేవీ కాంగ్రెసుకు మిత్రపక్షాలు కావు. చాలా పార్టీలు వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెసుకు ప్రత్యర్థి పార్టీలు. కాని ప్రతిపక్ష నేతలను వేధించడానికి ప్రభుత్వం ఏ స్థాయికి వెళుతుందో, ఎలా ప్రజల ముందు ప్రతిపక్ష నేతలను నేరస్తులుగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయో ఈ పార్టీలన్నీ చూస్తున్నాయి. రాహుల్ గాంధీ ఒక్కరిపైనే కాదు, అనేకమంది ప్రతిపక్ష నేతలపై అనేక కేసులు నమోదవుతున్నాయి. నిఘా సంస్థల విచారణలు కొనసాగుతున్నాయి. కొందరు జైలు పాలయ్యారు. విచారణల కోసం వారిని పిలవడం సుదీర్ఘ విచారణలు నడుస్తున్నాయి.

మరోవైపు గమనించవలసిన విషయమేమిటంటే, చాలా రాష్ట్రాల్లో ఎన్నికల తర్వాత బీజేపీకి అధికారం లభించకపోయినా, తర్వాత పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించి అధికారాన్ని అందుకుంది. ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టిన తర్వాత ఎన్నికల ఫండింగ్ నిధులన్నీ దాదాపుగా బీజేపీ ఖాతాలోకే వెళుతున్నాయి. ఈ పరిస్థితులపై చాలా మంది ఆలోచిస్తున్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలు ఎన్నుకున్న పార్టీ అధికారంలోకి రావడం మాత్రమే కాదు, వివిధ ప్రజాస్వామిక సంస్థలు, విలువల ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామిక పట్టాలపై మాత్రమే పరుగెత్తేలా చేయడం. కాని గత కొంతకాలంగా ఎన్నికల కమీషన్, న్యాయవ్యవస్థ వంటి స్వతంత్ర సంస్థల స్వేచ్ఛా నడవడి కూడా కుంటుతున్నట్లు కనిపిస్తోంది. దేశంలోని కార్పోరేట్ ప్రపంచం మొత్తం మోడీకి మద్దతుగా నిలబడి ఉంది.

ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు చేశారు. గౌతమ్ అదానీపై ప్రత్యేక కరుణాకటాక్షాలు ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. 2014లో కేవలం 7 బిలియన్లు ఉన్న ఆయన సంపద ప్రస్తుతం 100 బిలియన్లు ఎలా అయ్యిందని నిలదీస్తున్నారు? ఈ నేపథ్యంలో హిండెన్ బెర్గ్ నివేదిక కూడా వచ్చింది. అదానీ గ్రూపు ఘనకార్యాలు బయటకు వచ్చాయి. షేర్ల విలువ పడిపోవడం ప్రారంభమయ్యింది. అదానీ కొమ్ము కాస్తున్నది నరేంద్రమోడీ అంటూ రాహుల్ గాంధీ తన విమర్శలు మరింత తీవ్రం చేశారు. బ్రిటనులో ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ ప్రస్తుతం భారతదేశంలో ప్రజాస్వామ్యం గురించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. విదేశాల్లో భారతదేశాన్ని ఆయన అవమానించారంటూ బీజేపీ నేతలు గగ్గోలు చేయడం ప్రారంభించారు. అదానీ విషయంలో కాని, బ్రిటనులో తాను చేసిన వ్యాఖ్యల విషయంలో కాని రాహుల్ గాంధీ విజ్ఞప్తులను పార్లమెంటు ఆమోదించలేదు. ఈ లోగా పాత కేసులో ఒక కోర్టు శిక్ష విధించడం ఆ వెంటనే ఆయన్ను పార్లమెంటు నుంచి బహిష్కరించడం జరిగిపోయాయి.

ఈ బహిష్కరణ నిజానికి బీజేపీకి నష్టం కలిగించేలా ఉందని పలువురు వ్యాఖ్యాతల అభిప్రాయం. పార్లమెంటులో రాహుల్ గాంధీని ఎదుర్కోడానికి బీజేపీ ఇంతగా భయపడుతుందా? అందుకే బహిష్కరించడం జరిగిందా అనే చర్చ ఒకటి ప్రారంభమయ్యింది. మరోవైపు ప్రతిపక్షాలు ఎన్ని విభేదాలున్నా ఈ విషయంలో ఒక్కటవుతున్నాయి. అదానీ వ్యవహారంపై ప్రజల్లో చర్చ మొదలయ్యేలా చేయడానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు శ్రీరామనవమి సందర్భంగా జరిగిన అల్లర్లు, హింసాకాండల పెనుఘోషలో అదానీ వ్యవహారం నుంచి ప్రజల దృష్టి మళ్ళించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్నికలకు మరో సంవత్సరం మాత్రమే మిగిలి ఉంది. ఈ సంవత్సర కాలంలో ప్రతిపక్షాలు రాజకీయంగా నిలబడతాయా? కూలబడతాయా?? వేచి చూద్దాం.

అబ్దుల్ వాహెద్




# ఆర్థిక న్యాయానికి అద్భుతసూత్రం - జకాత్

**"మీరు అమితంగా ప్రేమించే వాటిని (అల్లాహ్ మార్గంలో) ఖర్చుపెట్టనంత వరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు." *(దివ్యఖుర్‌ఆన్: 3:92)***

భారత ముస్లిముల్లో పేదరికం ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సచర్ రిపోర్టు, రంగనాథ మిశ్రా కమీషన్ రిపోర్టులు ఈ వాస్తవాలను చాటి చెప్పాయి. భారత ముస్లిముల్లో పేదరికాన్ని పారదోలడానికి, ఆర్థికంగా నిలబడేలా చేయడానికి ప్రయత్నిస్తోంది జకాత్ సెంటర్ ఆఫ్ ఇండియా. జమాఅతె ఇస్లామీ హింద్ మార్గదర్శకత్వంలో ఈ సంస్థ భారతదేశంలో ముస్లిముల స్థితిగతులను జకాత్ వ్యవస్థ ద్వారా మార్చడానికి ప్రయత్నిస్తోంది.

గత నెలలో ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో జకాత్ సెంటర్ చైర్మన్ అమీనుల్ హసన్ మాట్లాడుతూ గత సంవత్సరం జకాత్ సెంటర్ మొత్తం 2 కోట్ల రూపాయల జకాత్ సేకరించిందని, ఈ సారి 20కోట్ల రూపాయలు సేకరించే లక్ష్యం పెట్టుకుందని తెలిపారు. జకాత్ సెంటర్ సేకరించే నిధులతో ఉపాధికల్పనా కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశంలో అత్యంత పేదలుగా ఉన్న ముస్లిముల ఆర్థిక స్థితి మెరుగుపరచడానికి ఈ నిధులను ఉపయోగిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. భారతదేశంలో ముస్లిముల సగటు దినసరి ఖర్చు కేవలం రు.32.66 పైసలు మాత్రమే ఉందని ఆయన వివిధ అధ్యయనాలను ఉటంకించారు. జకాత్ ఏ ప్రాంతం నుంచి వసూలు చేస్తున్నారో అదే ప్రాంతంలోని పేద ముస్లిముల కోసం జకాత్ సెంటర్ ఖర్చుపెడుతుందని ఆయన చెప్పారు.

జకాత్ సెంటర్ ఆఫ్ ఇండియా కార్యదర్శి అబ్దుల్ జబ్బార్ సిద్దీకీ మాట్లాడుతూ జకాత్ సెంటర్ ఏర్పాటైన మొదటి సంవత్సరంలోనే వెయ్యి నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఉపాధి కల్పనలో సహాయ పడిందని చెప్పారు. ఐదు వందల కన్నా ఎక్కువ మంది ముస్లిమ్ యువతీ యువకులకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ, విద్యాభివృద్ధి, ప్రగతి కార్యక్రమాలు నిర్వహించిందని తెలియజేశారు.

ఏటా పెద్దమొత్తంలో జకాత్ నిధులు వసూలవుతున్నాయి. అనేక సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించడం జరుగుతుంది. జకాత్ చెల్లించడం ఇస్లాంలో తప్పనిసరి విధి. ఇస్లాం ఒక పరిపూర్ణ జీవన వ్యవస్థ. మనిషి సర్వతోముఖ వికాసానికి కావలసిన మార్గదర్శక సూత్రాలన్నీ ఇందులో ఉన్నాయి. ఆర్థికన్యాయానికి సంబంధించిన సూత్రాలు కూడా ఇందులో ఉన్నాయి. ముస్లిం ఏటా సంపాదించిన సొమ్ము నిర్దిష్ట పరిమితి కన్నా ఎక్కువ ఉంటే తప్పనిసరిగా జకాత్ చెల్లించాలి. ముస్లిం సమాజం ఎదుర్కొనే అనేక ఆర్థిక సమస్యలకు జకాత్ గొప్ప పరిష్కారంగా ఉపయోగపడుతోంది. ముస్లిముల్లో వెనుకబాటును తొలగించడానికి సాధనంగా మారుతోంది. వాటన్నింటితో పాటు సమాజంలో ఉన్నవాళ్ళు,

లేనివాళ్ళ మధ్య సుహృద్భావ సంబంధాలు ఏర్పరిచి అద్భుత సామాజిక వాతావరణాన్ని ఏర్పాటు చేస్తోంది.

ఏటా భారీ మొత్తంలో జకాత్ పంపిణీ అవుతోంది. కాని దురదృష్టమేమిటంటే ఈ జకాత్ నిధులు కొన్ని దుర్వినియోగం కూడా అవుతున్నాయి. జకాత్ నిధులను సద్వినియోగం చేయడానికి, అవసరమున్న వారికి ఉపయోగపడేలా చేయడానికి జకాత్ సెంటర్ వంటి సంస్థలు పనిచేస్తున్నాయి. జకాత్ నిధులను నిర్వహించడం, పంపిణీ చేయడం, దుర్వినియోగం కాకుండా చూడడం, అర్హులు, యోగ్యులైన వారికి మాత్రమే అందేలా చూడడం ఇవన్నీ చాలా ముఖ్యమైన అంశాలు. జకాత్ సెంటర్ వంటి సంస్థలు ఈ ప్రయత్నాల ద్వారా ముస్లిం సమాజంలో జకాత్ వల్ల లభించే ప్రయోజనాలు పూర్తిగా లభించేలా చూస్తున్నాయి. ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో జకాత్ పంపిణీ అవుతోంది.

ప్రతి సంవత్సరం భారతదేశంలో ఎంత జకాత్ పంపిణీ అవుతుందన్న లెక్కలు ఖచ్చితంగా లేవు. దేశ జనాభాలో కేవలం కోటి మంది ముస్లిములు మాత్రమే జకాత్ చెల్లిస్తున్నారని భావించినా, వారు కనిష్ట మొత్తంలో అంటే లక్ష రూపాయల సంపదపై 2500 రూపాయల జకాత్ చెల్లిస్తున్నారని భావించినా, మొత్తం 2500 కోట్ల రూపాయల జకాత్ ఏటా పంపిణీ అవుతున్నట్లే. ఇది కేవలం ఒక అంచనా. నిజానికి పంపిణీ అయ్యే మొత్తం ఇంతకన్నా చాలా ఎక్కువ ఉంటుంది.

ముస్లిములు జకాత్ ఎందుకు చెల్లిస్తున్నారు? అనేది ఆలోచించవలసిన ప్రశ్న. వారిపై ఎలాంటి ఒత్తిడి లేకపోయినా స్వచ్ఛందంగా జకాత్ చెల్లిస్తున్నారన్నది గమనించాలి. కేవలం దైవప్రసన్నత కోసం ముస్లిములు జకాత్ చెల్లిస్తారు. మరోమాటలో చెప్పాలంటే, ఇతరులను ఆదుకోవడం, సహాయపడడం, దానధర్మాలు చేయడం ముస్లిం సంస్కృతిలో, ధర్మంలో అంతర్భాగం. పేదరికంలో ఉన్నవారిని ఆదుకోవడం మరోవిధంగా చెప్పాలంటే ఇస్లాంలో ధార్మిక విధి. మనిషి సంపాదించేది ఏదైనా దైవం ప్రసాదించిందే. అన్నీ దేవునికి చెందినవే. చివరికి అన్నీ దేవుని వద్దకే మరలిపోవలసి ఉంది. కాబట్టి మనిషికి ఇహలోకంలో లభించింది ఏదీ అతని స్వంతం కాదు. అవన్నీ దైవానికి చెందినవే. మనిషి కేవలం ఒక ట్రస్టీగా, ప్రతినిధిగా మాత్రమే ఉన్నాడు. మనిషికి లభించిన సంపద అతనిది కాదు, దైవానిది, మనిషి కేవలం ఆ సంపదకు ట్రస్టీగా ఉన్నాడు. కాబట్టి దైవం చెప్పినట్లు ఆ సంపదను ఖర్చు చేయడమే మనిషి చేయవలసిన పని. ఈ ధార్మిక విశ్వాసమే ముస్లిం సమాజంలో దానధర్మాలకు పునాది. అందువల్లనే ముస్లిములు భారీమొత్తంలో జకాత్ ప్రతి ఏటా చెల్లిస్తుంటారు.

పేదవారికి లేమి అనేది వారి పాపం ఏమీ కాదు. నిజానికి లేమితో బాధపడుతున్న వారిని ఆదుకోవడం కలవారి బాధ్యత. అందువల్లనే జకాత్ చెల్లించే ముస్లిములు తాము పేదవారికి ఉపకారం చేస్తున్నామనే భావంతో జకాత్ చెల్లించడం జరగదు. ఒక బాధ్యతగా జకాత్ చెల్లిస్తారు. పైగా జకాత్ స్వీకరించే వ్యక్తి నిజానికి ఉపకారం చేసినట్లవుతుంది. రమజాను మాసంలో జకాత్ తో పాటు ఇతర స్వచ్ఛంద దానధర్మాలు విస్తృతంగా చేస్తుంటారు.

ఇంతకుముందు చెప్పుకున్నట్లు ఇస్లాం ప్రకారం మనిషికి లభించిన సంపద నిజానికి అతని స్వంతం కాదు. అసలు యజమాని దైవం. మనిషి కేవలం ట్రస్టీ మాత్రమే. దైవాదేశాల ప్రకారం నమాజులు చదవడం, ఉపవాసాలు ఉండడం ఎలా పాటిస్తున్నారో, అదేవిధంగా దైవాదేశాల ప్రకారం సంపదను కూడా ఖర్చు చేయాలి. ఎలా సంపాదించాలి? ఎలా ఖర్చుపెట్టాలి? అనే ప్రశ్నలకు స్పష్టమైన మార్గదర్శక సూచనలు దివ్యఖుర్ ఆన్ తెలియజేసింది. అన్నీ దైవానికి చెందినవే అనేది బలమైన ధార్మిక విశ్వాసమైనప్పుడు, వాటిని సంపాదించడం, ఖర్చుపెట్టడం అంతా దైవాదేశాల ప్రకారం జరగడమే సముచితం.

అందువల్లనే ముస్లిములు అత్యధికంగా దానధర్మాలకు ఖర్చు చేస్తారు. జకాత్ తప్పనిసరిగా ఇవ్వవలసిందే. జకాత్‌తో పాటు స్వచ్ఛందంగా చేసే దానధర్మాలు కూడా చాలా ఉన్నాయి. సదఖాలు, స్వచ్ఛంద దానాల రూపంలో కోట్లాది రూపాయలు పంపిణీ అవుతుంటాయి. రమజాన్ మాసం ప్రపంచంలోని రెండువందల కోట్ల మంది ముస్లిములను ఒకే సంప్రదాయం క్రింద ఒక్కటయ్యేలా చేస్తుంది. ఇందులో నమాజులు, ఉపవాసాలతో పాటు అతి ముఖ్యమైనది పేదవారిని ఆదుకోడానికి జకాత్, సదఖాల ద్వారా ప్రయత్నించే సంప్రదాయం. జకాత్




మరో విధంగా చెప్పాలంటే సమాజంలోని సంపన్నులు, పేద వారికి మధ్య సామాజిక వంతెన వంటిది. నిరాశనిస్పృహల్లో ఉన్న వారిని ఆదుకోవడం అనేది ధార్మిక బాధ్యతగా మారి నప్పుడు, పేదల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని వారిని ఆదుకోవడం ఒక బాధ్యతగా సంపన్నులు ముందుకు వచ్చినప్పుడు ఆ సమాజం నిస్సందేహంగా గొప్ప సమాజంగా మారుతుంది. అర్థం చేసుకోవలసిన మరో విషయమేమిటంటే, సంపన్నుల సంపదలో పేదవారికి హక్కు ఉందని స్పష్టం చేస్తుంది ఇస్లాం. అంటే సంపన్నులు చెల్లించే జకాత్ నిజానికి పేదల హక్కును వారికి ఇవ్వడం.

జకాత్ అంటే శుద్ధి చేయడం అరబీ పదం జకాత్ అర్థాలను పరిశీలిస్తే, శుద్ధి చేయడం, వృద్ధి చేయడం వంటి అర్థాలున్నాయి. ముస్లిం తన సంపదలో నిర్దిష్ట శాతం పేదల హక్కుగా చెల్లించడం ద్వారా తన సంపదను పరిశుద్ధం చేస్తాడు. ఇలా పరిశుద్ధమైన సంపద మరింత వృద్ధి చెందుతుందన్నది ముస్లిం విశ్వాసం.

"ప్రవక్తా! నీవు వారి సంపదల నుండి సదఖా తీసుకొని వారిని పరిశుద్ధపరచు. ఇంకా (సన్మార్గంలో) వారిని ముందుకు నడుపు." (దివ్యఖుర్ఆన్ 9:103)

దైవాదేశాల ప్రకారం దైవప్రసన్నత పొందడానికి ఖర్చు పెట్టడం వల్ల మనిషి ఆత్మ, హృదయం పరిశుద్ధమవుతాయి. మనిషిలో భౌతిక సంపదల పట్ల ప్రేమ తగ్గుతుంది. పరుల పట్ల సానుభూతి పెరుగుతుంది. మరోమాటలో చెప్పాలంటే, దైవం, దైవాదేశాల కన్నా ఇహలోకపు సిరిసంపదలు తనకు ముఖ్యం కాదని మనిషి జకాత్ చెల్లించడం ద్వారా ప్రకటిస్తున్నాడు. ఇదే విషయాన్ని దివ్యఖుర్ఆన్ స్పష్టంగా చెప్పింది. "నమాజును స్థాపించండి. జకాత్ ఇవ్వండి. మీ భవిష్యత్తు కోసం మీరు చేసి ముందుగా పంపించే సత్కార్యాలను మీరు అల్లాహ్ వద్ద చూస్తారు." *(దివ్యఖుర్ఆన్ 2:110)*

జకాత్ వ్యవస్థలో అంతర్లీనంగా ఉన్న అంశాలను గమనించడం కూడా అవసరం. ప్రజాసంక్షేమం, సానుభూతి, పరోపకారం, న్యాయం వంటి అత్యున్నత మానవవిలువలు అందులో ఉన్నాయి. జకాత్ వ్యవస్థ ఈ విలువలను పెంపొందేలా చేస్తుంది. ఈ విలువలు సమాజానికి ప్రాణవాయువుల వంటివి. దానధర్మాలను అందరూ మెచ్చుకుంటారు. మంచి విషయాలని అంటారు. కాని ఇస్లాం తప్పనిసరి చేసింది. ఎంత దానం చేయాలన్నది కూడా తప్పనిసరి చేసింది. ఇలాంటి తప్పనిసరి ధార్మికవిధిగా దానధర్మాలను నిర్దేశించడం వెనుక ఉన్న ముఖ్యమైన ఉద్దేశ్యం న్యాయం.. ఆర్థిక న్యాయం. ఆర్థిక న్యాయం సాధించడం ద్వారా మాత్రమే సామాజిక న్యాయం కూడా సాధ్యపడుతుంది. సమాజంలో సమానత్వం వేళ్ళూనుకుంటుంది. అందరూ సమానులే. ఎవరు దైవం దృష్టిలో ఎక్కువ కాదు. కలవారికి ఆ సంపద వారి స్వంతమూ కాదు. అది దైవం ఇచ్చింది మాత్రమే. ఈ భావన అటు ఉన్నవారిలోను, ఇటు లేనివారిలోను ఇద్దరిలోను బలంగా ఉండడం వల్ల సమాజంలో ఎక్కువ తక్కువలనే తేడాలే ఉండవు.

నిశితంగా పరిశీలిస్తే ఇస్లాంలోని వివిధ నిబంధనలు సమాజంలో నిమ్నోన్నతలను పెళ్ళగించడానికి ఉద్దేశించినవిగా స్పష్టంగా అర్థమవుతుంది. నమాజులో రాజు పేద అనే తేడా లేదు. అందరూ ఒకే వరుసలో నిలబడవలసిందే. ఉపవాసాల్లో పేద ధనిక తేడా లేదు. అందరూ ఆకలి బాధను రుచి చూడ వలసిందే. జకాత్ చెల్లించడం పేదలకు సంపన్నులు చేసే ఉపకారమేమీ కాదు, అది వారి బాధ్యత. పేదల హక్కు. సంపాదించిన సంపదలో పేద వారికి కూడా హక్కు ఉందని నిర్ధారించడం ద్వారా బలమైన సామాజిక బంధాలను, ఆర్థిక న్యాయాన్ని సాధించింది ఇస్లాం.

ఇస్లామీయ చరిత్రను పరిశీలిస్తే ఈ సామాజిక బంధాలు, మానవీయ విలువలు సాధించిన అనేక విజయాలు మనకు కనిపిస్తాయి. "తమ సంపదను రేయింబవళ్ళు బహిరంగంగానూ, రహస్యంగానూ ఖర్చు చేసే వారు తమ ప్రతిఫలాన్ని తమ ప్రభువువద్ద పొందుతారు. వారికి ఏ విధమైన భయంగాని, దుఃఖంగాని కలిగే అవకాశం లేదు." (దివ్యఖుర్ఆన్ 2: 274) దివ్యఖుర్ఆన్ న్యాయవంతమైన, సత్సమాజ స్థాపనకు అవసరమైన ఆదేశాలను చాలా స్పష్టంగా అందించింది.

"ఈ గ్రంథ ప్రజల యొక్క చాలామంది పండితుల స్థితీ, సన్యాసుల స్థితీ ఎటువంటిదంటే, వారు ప్రజల సొమ్మును అక్రమ పద్ధతుల ద్వారా తినేస్తారు. వారిని అల్లాహ్ మార్గం అనుసరించకుండా ఆపుతారు. వెండి బంగారాలను పోగుచేసి వాటిని దైవ మార్గంలో ఖర్చుపెట్టని వారికి వ్యధాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి." *(దివ్యఖుర్ఆన్ 9:34)*

"బంధువుల పట్ల మీ విధులను నిర్వహించండి. పేదవారిపట్ల, బాటసారులపట్ల, మీ విధులను నిర్వర్తిం చండి. వృధా ఖర్చు చెయ్యకండి. వృధా ఖర్చు చేసేవారు షైతాను సోదరులు." *(దివ్యఖుర్ఆన్ 17:27)*

"విశ్వసించిన ఓ ప్రజలారా! కేవలం పరుల మెప్పును పొందటానికే తన ధనం ఖర్చుచేసేవాని మాదిరిగా అల్లాహ్‌ను అంతిమ దినాన్నీ విశ్వసించని వాని మాదిరిగా, మీరు దెప్పిపొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి మీ దాన ధర్మాలను మట్టిలో కలపకండి." *(దివ్యఖుర్ఆన్ 2: 264)*

సంపదను ఎలా సంపాదించాలి? ఎలా ఖర్చు పెట్టాలనే స్పష్టమైన ఆదేశాలివ్వడం ద్వారా దివ్యఖుర్ ఆన్ ఒక అద్భుతమైన సమాజాన్ని మాత్రమే కాదు, ఒక అద్భుతమైన ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేసింది. ✤



# మాతృత్వంలోనే ఉంది ఆడజన్మ సార్థకం

హుమేరా అమీర్, ఏలూరు

స్త్రీకి మాతృత్వం ద్వారా ఇహ, పరలోకాల్లో ఉన్నత స్థాయి బహుమతి లభిస్తుంది.

సృష్టిలో మానవజాతితో పాటు సకల ప్రాణికోటి పునరుత్పత్తి జరిగేది కేవలం మాతృత్వం అనే ఈ వరం కారణంగానే. ఈ మాతృత్వమే లేకపోయినట్లయితే మొదటి మానవ జంట దగ్గరే మానవ సృష్టి యావత్తూ ఆగిపోయి ఉండేది.

మాతృత్వం (Motherhood) స్త్రీలకు దేవుడిచ్చిన వరం. అయినా ప్రాచీనకాలం నుండి ప్రసవం (Childbirth) అంటే స్త్రీలకు పునర్జన్మ అని భావిస్తారు. వైద్యశాస్త్రం అత్యాధునిక ప్రగతిని సాధించిన ప్రస్తుత కాలంలో కూడా లక్షలాది తల్లులు ప్రసవం సమయంలో మరణిస్తూనే వున్నారు. ప్రసవ సమయంలో స్త్రీలు అధికంగా మరణించడానికి లేదా అనేక రకాలైన పలు అనారోగ్యాలకు గురి కావడానికి చాలా కారణా లున్నాయి. వాటిలో ముఖ్యమైనవి, పేదరికం కారణంగా గర్భంతో ఉన్న మహిళలు సరైన పోషకాహారం తీసుకోలేక పోవడం, తత్కారణంగా రక్తహీనత, వ్యాధి నిరోధక శక్తి లోపం, దీర్ఘకాలిక వ్యాధులు, నిరక్షరాస్యత కారణంగా సరైన ప్రాథమిక ఆరోగ్య పరిజ్ఞానం లేకపోవడం, గ్రామీణ స్త్రీలకు సరైన వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం, కొన్ని పట్టణ ప్రాంతాలలో కూడా అవసరానికి తగినట్లుగా మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం, అజ్ఞానం, మూఢాచారాల కారణంగా కుటుంబ నియంత్రణ పాటించక పోవడం కారణంగా స్త్రీలలో శారీరక శక్తి సన్నగిల్లి, ప్రసూతి సమయంలో తీవ్రమైన రక్తస్రావం, అధిక రక్తపోటు, అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఉద్భవించి ప్రసవ సమయ మర ణాలు అధికంగా సంభవిస్తున్నాయి.

ఒక బిడ్డను కనాలంటే తల్లి తన గర్భంలో బిడ్డని తొమ్మిది నెలలు గర్భాశయంలో పెంచి, ఆ తర్వాత బిడ్డకు జన్మ నివ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత పాలు త్రాగించి, ఆహారం

తినిపించి, ప్రేమతో పెంచుతుంది. అందుకే తల్లిని మించిన ప్రేమమూర్తి, తల్లి ప్రేమ కంటే గొప్ప ప్రేమ, అమ్మ ఒడి కంటే గొప్ప భద్రత ఈ ప్రపంచంలోనే లేదంటే అతిశయోక్తి కాదు. ఒక మనిషి తన జీవితం అంతా తన తల్లికి ఊడిగం చేసినా కూడా తన కన్నతల్లి ఋణం తీర్చుకోలేనిది.

తల్లిరుణం తీర్చుకోవడం గురించి ఒక అనుచరుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా దైవప్రవక్త ముహమ్మద్(స) కన్నతల్లి ప్రాముఖ్యత గురించి ఇలా చెప్పారు: నీ జీవితం అంతా నీ తల్లిని కాలు కిందపెట్టకుండా ఆమెను నీ భుజాలపై మోసినా కూడా అది ఆమె నిన్ను కనేటప్పుడు పడిన పురుటినొప్పులలో ఒక నొప్పికి కూడా సమానం కాదు అని తేల్చి చెప్పడం జరిగింది.

బిడ్డను ప్రసవించడం అనేది రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి సాధారణ ప్రసవం, రెండవది సిజేరియన్ సెక్షన్. సిజేరియన్ జననం అనేది తల్లి పొత్తికడుపు, గర్భాశయంలో చేసిన కోత ద్వారా అంటే శస్త్రచికిత్స ద్వారా శిశువును ప్రసవించడం.

ప్రతి సంవత్సరం దాదాపు 5,00,000 ప్రసూతి మరణాలకు గర్భం, శిశు జననంతో వచ్చే సమస్యలు కారణమవుతున్నాయి, 7 మిలియన్ల మహిళలు తీవ్రమైన దీర్ఘకాలిక సమస్యలను ఎదుర్కొంటున్నారు, ప్రసవం తరువాత 50 మిలియన్ల మంది మహిళలకు ప్రతికూల ఆరోగ్య ఫలితాలు సంభవిస్తున్నాయి. వీటిలో ఎక్కువ భాగం అభివృద్ధి చెందుతున్న దేశాలలో జరుగుతాయి అని పలు నివేదికలు తెలియజేస్తున్నాయి.

ప్రసూతి మరణాలు ఎక్కువగా సుదీర్ఘ ప్రసవ సమయాల్లోనే జరుగుతూ ఉంటాయి. కొందరిలో సుదీర్ఘ ప్రసవం కారణంగా కూడా శస్త్ర చికిత్స ద్వారా బిడ్డను తీయవలసి వస్తుంది. సుదీర్ఘ ప్రసవం అంటే స్త్రీ ప్రసవాన్ని కొనసాగించలేకపోవడం. సుదీర్ఘ ప్రసవం సాధారణంగా మొదటి సారి బిడ్డను కనే తల్లులలో దాదాపు 20 గంటలకు పైగా కొనసాగుతూ ఉంటుంది. ఇప్పటికే పిల్లలను కలిగి ఉన్న మహిళలకు సుమారుగా 14 గంటలకు పైగా ఉంటుంది. ఆ కారణంగా ప్రసవించవలసిన స్త్రీ శారీరకంగాను, మానసికంగాను అలసిపోతుంది. ఒక్కోసారి స్పృహకోల్పోయే పరిస్థితి వస్తుంది. సాధారణంగా స్త్రీకి 18 గంటలకు మించి పురిటి నొప్పులు ఉన్నప్పుడు, నిర్జలీకరణం, అలసట, విపరీతమైన కండరాల ఒత్తిడి, తల్లి హృదయ స్పందన రేటు పెరగడం మొదలైనవి ఉంటాయి. ఇటువంటి సమయాల్లో కూడా ప్రసూతి మరణ నివారణ చర్యల్లో భాగంగా డాక్టర్ లు సిజేరియన్ సెక్షన్ అవసరమని ప్రతిపాదిస్తారు. సుదీర్ఘ ప్రసవానికి గురవుతున్న మహిళలు రక్షణ చర్యల్లో భాగంగా శస్త్రచికిత్సతో, వైద్యుని పర్యవేక్షణలో ఉండాలి.

ప్రసవ సమయంలో స్త్రీని నిశితంగా పరిశీలించాలి. సుదీర్ఘ ప్రసవానికి సంబంధించిన సంకేతాలు కనిపించడం ప్రారంభిస్తే, వెంటనే స్పందించి, వైద్య నిపుణులు 24 గంటలలోపు ప్రసవ అవకాశాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలి.

సాధారణ ప్రసవంలో మూడు దశల ప్రసవం ఉంటుంది: ఈ మూడు దశలకూ కలిపి సాధారణంగా సుమారు 15 గంటల నుండి 20 గంటల పాటు తల్లి కాబోయే స్త్రీ విపరీతమైన మానసిక, శారీరక ఒత్తిడికి లోనవుతుంది. పొత్తికడుపు బిగదీయటం నుండి మొదలై ప్రసవం జరిగే వరకు భరించలేని నొప్పులు అనుభవించాల్సి ఉంటుంది. గర్భం ముగింపు దశలో అంటే మహిళ గర్భాశయం నుండి బిడ్డ బయటకు వచ్చే సమయంలో ఆ స్త్రీ పడే నొప్పులు పురిటి నొప్పులు అంటారు. ఈ నొప్పులు పడే సమయంలో ఆ స్త్రీ పడే బాధ వర్ణనాతీతం. నిస్సందేహంగా డెలివరీ అనేది కొంతమంది మహిళలకు తప్ప మిగతా మహిళలందరికీ బాధాకరమైన అనుభవం. కానీ ప్రసవం అనేది బహుమతినిచ్చే అనుభవం. ప్రతీ గర్భిణీ స్త్రీకి ప్రసవ నొప్పి ఉంటుంది. ఈ నొప్పులలో ఎక్కువ, తక్కువలు ఉంటాయి. ఈ పురిటి నొప్పులను కొలవడానికి నమ్మదగిన క్లినికల్ కొలమానం ఇంతవరకు కనుగొనబడలేదు. 1940లలో, పరిశోధకులు డోలోరిమీటర్ అని పిలువబడే పరికరాన్ని పురిటి నొప్పులను కొలవడానికి ఉపయోగించేవారు. అయినప్పటికీ, నొప్పి అనేది శారీరక అనుభూతిపై మాత్రమే ఆధారపడి ఉండదని రుజువవ్వడంతో ఈ కొలత అనుకూలంగా లేదని కొట్టిపారేయడం జరిగింది. ప్రసవ ప్రక్రియ సమయంలో వచ్చే నొప్పి తప్పనిసరిగా స్థిరంగా ఉండాలని ఏమీ లేదు. మనిషి మనిషికీ తేడా ఉంటుంది. సమయాన్ని బట్టి తేడా ఉంటుంది, స్త్రీ మానసిక, శారీరక స్థితిగతులను బట్టి ఉంటుంది, నొప్పి అనేది ఒక వ్యక్తి భయాలు, మానసిక స్థితి, జ్ఞాపకాలు, వ్యక్తిత్వం, అలాగే నొప్పి మూలం వ్యవధి

వంటి అనేక కారణాలు, అంశాల ఆధారంగా ప్రభావిత మవుతుంది.

288 మంది స్వీడిష్ మహిళలపై నిర్వహించిన ఒక అధ్యయ నంలో, వారిలో 28% మంది ప్రసవ నొప్పిని సానుకూల పరిస్థితిగా అంచనా వేశారు. వారిలో 41% మంది దీనిని తమకు కలిగిన చేదు అనుభవంగా భావించారు. ప్రసవ నొప్పుల భయం మహిళలను సిజేరియన్కు వెళ్లేలా చేసే ముఖ్యమైన కారణాలలో ఒకటిగా నివేదికలు తెలియజేస్తు న్నాయి. ఇరాన్లో సిజేరియన్కు సంబంధించిన కారణాలపై చేసిన అధ్యయనంలో, ప్రసవ నొప్పి భయంతో 37.2% మంది సిజేరియన్‌కు వెళ్తున్నారని తేలింది. ప్రసవ నొప్పి భయంతో సిజేరియన్‌కు వెళ్లేవాళ్ళు ఇప్పుడు భారతదేశం లోనూ ఎక్కువగానే ఉన్నారు

నొప్పికి ప్రతిచర్యగా స్త్రీలు స్పందించే తీరు కూడా ప్రతి వ్యక్తిలో భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు, కొరియన్ సంస్కృతిలో ప్రసవ సమయంలో మహిళలు నిశ్శబ్దంగా ఉండటం చాలా ముఖ్యం. కానీ యూరోపియన్లు, అమెరికన్లు నొప్పి పట్ల అనేక రకాల ప్రతిచర్యలను చూపుతారు.

చాలా సందర్భాలలో మాతాశిశు మరణాలను నివారించ వచ్చు. మహిళలకు ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉన్నట్లయితే, సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చు లేదా చికిత్స చేయవచ్చు. గర్భిణులు, ప్రసవించిన వారు వైద్య చికిత్స ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలి. ఒక స్త్రీకి బిడ్డ పుట్టడం సంతోషం మాత్రమే కాదు తల్లీ బిడ్డల ఆరోగ్యం ఒక సవాలు కూడా. ప్రసవానంతర కాలానికి సంబంధించిన వివిధ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల లభ్యత గురించి భారతీయ మహిళల్లో అవగాహన పెంచడానికి వైట్ రిబ్బన్ అలయన్స్ ఇండియా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11 న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం (National Safe Mother-hood Day) ఏర్పాటు చేసింది. WRAI చేసిన ప్రతిపాదనకు ప్రతిస్పందనగా 2003లో భారత ప్రభుత్వం కస్తూరిబా గాంధీ (జాతిపిత మహాత్మా గాంధీ గారి సతీమణి) పుట్టిన రోజును పురస్కరించుకుని ఏప్రిల్ 11ని జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవంగా నిర్ణయించింది.

గర్భం, డెలివరీ సమయంలో మహిళలందరి భద్రత మరియు ఆరోగ్యాల కోసం "సురక్షితమైన మాతృత్వం" అందించడం అవసరం. ప్రపంచవ్యాప్తంగా మొత్తం మాతాశిశు మరణాలలో ఎక్కువశాతం భారతదేశంలోనే సంభవిస్తున్నాయి. ప్రపంచం లోని మొత్తం ప్రసూతి మరణాలలో 15% భారతదేశంలోనే ఉంటున్నాయి. 80 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కలిగిన వాతావరణంలోనే బిడ్డ లకు జన్మనిస్తారు, అయినప్పటికీ, మరణాల రేటు ఇప్పటికీ గణనీయంగా ఉంది. గర్భం సంబంధిత మరణాలు భారత దేశంలో ప్రతి సంవత్సరం 44,000 అని ఒక అంచనా.

మాతృత్వం అనేది ఒక దివ్యమైన అనుభూతి, అయితే ఆ మాతృత్వాన్ని పొందే ప్రయత్నంలో ఒక స్త్రీ తన ప్రాణాలు పోగొట్టుకుంటే, పరలోకంలో అత్యున్నత స్థానమైన షహీద్ స్థానాన్ని ఇస్తాను అని దైవం చెప్పడం జరిగిందంటే, మాతృత్వం కోసం స్త్రీ పడే కష్టం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# ఉత్తమ నైతిక విలువలు నేర్పే ఉపవాసాలు

**- అబ్దుల్ బాసిత్**

**ఉపవాసాలను అరబీ భాషలో సౌమ్ అని అంటారు. సౌమ్ అంటే నిలిచిపోవడం, ఆగిపోవడం అని అర్థం. ఉపవాసం అంటే కేవలం ఆకలిదప్పులతో ఉండటమే కాదు. శరీర అవయవాలన్నీ సకల చెడుల నుంచి దూరంగా ఉండాలి. సృష్టికర్త అయిన అల్లాహ్ అనుగ్రహం కోసం ధర్మసమ్మతం అయిన వాటి నుంచి కూడా ఆగిపోవడమే ఉపవాసం అంటే.**

అసలు ఈ ఉపవాసాలు ఎందుకు అంటే,

ఈ నెలలోనే ఈ సృష్టికి కర్త ఎవరో, ఈ సృష్టిలో అత్యుత్తమ జీవిగా మానవ జీవిత మర్మాన్ని వివరించిన సృష్టికర్త ఆదేశాల గ్రంథం ఖుర్ఆన్ అవతరించింది.

అందుకు కృతజ్ఞతగా ఏకేశ్వరుడు అయిన అల్లాహ్‌ను విశ్వసించే వారు తప్పనిసరిగా ఉపవాసాలు పాటిస్తారు.

పవిత్ర ఖురాను అవతరించిన నెల రమజాను నెల. మానవులందరికీ (ఆ గ్రంథం) మార్గదర్శకం. ఋజుమార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన ఉపదేశాలు అందులో ఉన్నాయి. కనుక ఇకనుండి రమజాను నెలను పొందే వ్యక్తి ఆ నెల అంతా విధిగా ఉపవాసం ఉండాలి. (2:185)

ఈ ఖుర్ఆన్ గ్రంథంలోని కొన్ని ఆదేశాలు.

మానవులారా ! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి. (2:21-22)

నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు: మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచి తనంతో వ్యవహరించండి. ఒకవేళ మీ వద్ద వారిలో ఒకరు గాని ఇద్దరుగాని ముసలివారై ఉంటే, వారిముందు విసుగ్గా "ఉఫ్" అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమా

ధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారిముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి! "ప్రభూ! వారిపై కరుణ జూపు, బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు" (17:23-24)

- ✤ బంధువులపట్ల మీ విధులను నిర్వహించండి.
- ✤ పేదవారిపట్ల, బాటసారులపట్ల, మీ విధులను నిర్వర్తించండి.
- ✤ వృధా ఖర్చు చెయ్యకండి. వృధాఖర్చు చేసేవారు. షైతాను సోదరులు. షైతాను తన ప్రభువునకు కృతఘ్నుడు.
- ✤ మీ చేతిని మెడకు బంధించి ఉంచకండి, దానిని పూర్తిగా స్వేచ్ఛగానూ వదలిపెట్టకండి. అలాచేస్తే నిందలపాలవుతారు, దిక్కు లేనివారవుతారు.
- ✤ నీ ప్రభువు తన ఇష్టప్రకారం కొందరి ఉపాధిని సమృద్ధం చేస్తాడు. కొందరి ఉపాధిని పరిమితం చేస్తాడు. ఆయన తన దాసుల స్థితిని బాగా ఎరుగును. ఆయన వారిని పరికిస్తున్నాడు.
- ✤ పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చెయ్యకండి. మేము వారికి ఉపాధిని ఇస్తాము, మీకూ ఇస్తాము. వాస్తవానికి వారిని హత్య చేయటం ఒక పెద్ద నేరం.
- ✤ వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. అది అతి దుష్ట కార్యం, బహుచెడ్డ మార్గం.
- ✤ ఏ ప్రాణాన్ని హతమార్చకండి న్యాయంగా తప్ప దానిని హతమార్చడాన్ని అల్లాహ్ నిషేధించాడు.

  "హత్యకు బదులుగాగాని లేదా కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకు గాని కాక మరే కారణంవల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే."
- ✤ అన్యాయంగా హత్య చెయ్యబడిన మనిషి వారసునికి మేము ఖిసాస్‌ను (అంటే పరిహారం) కోరే హక్కును ప్రసాదించాము. కాని ఆ వారసుడు హత్యలో హద్దులు మీరకుండా ఉండాలి." అప్పుడు అతనికి సహాయం చెయ్యటం జరుగుతుంది."
- ✤ సక్రమమైన పద్ధతిలో తప్ప అనాధుని సొమ్ము జోలికి పోకండి, అతడు యుక్తవయస్సునకు చేరేవరకు.
- ✤ చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నిస్సందేహంగా వాగ్దానం విషయంలో మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది.
- ✤ కొలపాత్రతో ఇస్తే పూర్తిగా నింపి ఇవ్వండి. తూచినట్లయితే సరైన తరాజుతో తూచండి. ఇది మంచి పద్ధతి. పర్యవసానాన్నిబట్టి కూడా ఇదే ఉత్తమం.
- ✤ మీకు తెలియని విషయం వెంటపడకండి. నిశ్చయంగా కళ్ళూ, చెవులూ, మనస్సూ అన్నింటి విషయంలోనూ విచారణ జరుగుతుంది.
- ✤ భూమిపై విర్రవీగుతూ నడవకండి. మీరు భూమిని చీల్చనూ. లేరు పర్వతాల ఎత్తుకు చేరనూలేరు.

స్త్రీలూ, సంతానమూ, వెండి బంగారు మేలుజాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాల పై ప్రేమ ఆకర్షణీయంగా చెయ్యబడింది. కాని ఇవన్నీ తాత్కాలిక ఐహిక జీవన సంపదలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే.

మీలో మంచివైపునకు పిలిచేవారూ, మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించేవారూ, చెడు నుండి వారించే వారూ కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పనిని చేసేవారే. సాఫల్యం పొందుతారు.

ఉపవాసం అంటే సృష్టికర్త అయిన అల్లాహ్‌కు దరి చేరడం. ఉపవాసం అంటే ఆకలిదప్పులతో అలమటించడం కాదు. కళ్ళతో చెడు చూడకుండా, చెవులతో చెడు వినకుండా, నాలుకతో చెడు మాట్లాడకుండా, మనసులో చెడు ఆలోచనలు దరి చేరకుండా ఉండటమే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం.

**"ఇది సహనం వహించ వలసిన నెల. సహనానికి ప్రతి ఫలం స్వర్గం."**

అంటే ఎలాగైతే ఎంత ఆకలి వేసినా, ఎంతగా దాహం వేసినా ఎలా అయితే సహనం వహిస్తారో, అలాగే మన చుట్టూ ఉన్న చెడు ఎంతగా ఆకర్షించిన, ఎంతగా ప్రలోభాలకు గురి చేసినా, ప్రాపంచిక భోగలాలసాలు ఎంతగా ఉసికొల్పిన వాటి జోలికి వెళ్ళకుండా సహనం వహించాలి.

"రోజా డాలు వంటిది. రోజా అంటే ఉపవాసం పాటించేవారు నోటితో అశ్లీలమైన మాటలు మాట్లాడరాదు. ఇతరులతో జగడానికి దిగరాదు. ఇతరులు జగడానికి దిగిన నేను రోజా పాటిస్తున్నాను అని గుర్తుంచుకోవాలి."

"రోజా పాటించేవారు అబద్ధాలు చెప్పడం, అసత్యాన్ని ఆచరించడం మానకపోతే, అలాంటి వారు ఆకలిదప్పులతో

పడి ఉండటం పట్ల అల్లాహ్‌కు ఏ మాత్రం ఆసక్తి లేదు.”అని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు.

మనిషి మంచి వాడిగా మానవతా విలువలు కలిగిన మహోన్నతుడిగా మారాలన్నదే ఉపవాసాల అసలు ఉద్దేశ్యం. అలాంటి వారు తమ జీవితాలను సత్యం, న్యాయం, ధర్మం అనే పునాదుల మీద తమ జీవిత సౌధాన్ని నిర్మించుకోవాలి. అంతేకాని రోజా పాటిస్తూ, అబద్ధాలు ఆడటం, అశ్లీల పనులు చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. అలాంటి వారు ఆకలిదప్పులతో పడి ఉండటం తప్ప లాభం ఏమీ ఉండదు.

ఇంకా ఈ ఉపవాసాల మరో ఉద్దేశ్యం, సమాజం లోని బీదసాదల పట్ల సానుభూతి వహించడం.

ఆగర్భ శ్రీమంతులు సైతం ఈ ఉపవాసాలు పాటించడం ద్వారా ఆకలి అంటే ఏమిటో అనుభవ పూర్వకంగా తెలుసుకుని సమాజంలోని బీద సాదల పట్ల సానుభూతి వహించడం, వారిని ఆదుకోవడం, దైవం ఇచ్చిన దాంట్లో వారి హక్కులను చెల్లించే గుణాన్ని అలవర్చుకోవాలి.

“ఈ సృష్టికి సృష్టికర్త అయిన దేవుడు ఉన్నాడు. ఆయన ఒక్కడే. ఆయనే యావత్ మానవాళి జనన మరణాలకు కారణభూతుడు. మరణానంతరం ఇక్కడ చేసిన ప్రతి పనికి జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. ఈ జీవితం శాశ్వతం కాదు. శాశ్వతమైనది పరలోక జీవితం” అని విశ్వసించేవారు. ఖురాన్ బోధనలను, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆచరణాత్మక బోధనలను తూ. చా. తప్పకుండా పాటించాలి.

తాను కడుపు నిండా తిని, తన పొరుగు వారు పస్తులు ఉండడాన్ని సహించే వారు విశ్వాసులు కానే కాదు అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).

“ఎవరి పనుల వల్ల తన పొరుగు వారికి మనశ్శాంతి లేకుండా పోతుందో వారు విశ్వాసులే కాదు”

అనాథలు, వితంతువులు, అగత్యపరులను ఆదుకునేవారు రాత్రంతా జాగరణ చేసేవారితో పగలంతా ఉపవాసం పాటించేవారితో, ధర్మ సంస్థాపన కోసం ప్రాణాలర్పించిన వారితో సమానం అని అన్నారు ప్రవక్త ముహమ్మద్(స).

నేల మీద ఉన్న వారిపై కరుణ చూపండి. నింగిలో ఉన్న వాడు మీపై కరుణ చూపుతాడు.

“ఆపదలో ఉన్న సాటి వారికి సహాయం చేస్తే, అల్లాహ్ మిమ్మల్ని ఆపదలో ఆదుకుంటాడు.”

సదఖా అంటే సాటి వారిని ఆదుకునేందుకు చేసే సహాయం.

ఇలా ప్రతి ఒక్కరూ తమకు తాము స్వచ్ఛందంగా సకల చెడులకు, అధర్మ పనులకు దూరంగా ఉంటే, ఒక ఉత్తమ నైతిక విలువలు మానవతా విలువలతో కూడిన సత్ సమాజం ఉనికిలోకి వస్తుంది. ✤


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని ‘Geeturai Weekly’ పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




# చరిత్ర నేర్పే పాఠాలు

**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**విశ్వప్రభువు అల్లాహ్‌ను తిరస్కరించి తలబిరుసు ప్రదర్శించిన జాతులు కాలగర్భంలో కలిసి పోయాయి. వారిపై తీవ్రమైన శిక్షలు విరుచుకు పడ్డాయి.**

“మరి వారిలో ప్రతి ఒక్కరినీ మేము అతని పాపాలకుగాను పట్టుకున్నాము. వారిలో కొందరిపై (ఆద్ జాతిపై) మేము రాళ్ళ వాన కురిపించాము. వారిలో కొందరిని(సమూద్ జాతిని) భయంకరమయిన శబ్దం ద్వారా మట్టు పెట్టాము. వారిలో కొందరి (ఖారూన్)ని మేము భూమిలో కూర్చి వేశాము. వారిలో కొందరిని (ఫిర్ఔన్, అతని అనుయాయుల్ని) మేము ముంపుకు గురి చేశాము. అల్లాహ్ వారికి అన్యాయం చేసే వాడు కాదు. నిజానికి వాళ్ళే తమకు తాము అన్యాయం చేసుకున్నారు”. (అన్‌కబూత్: 40)

హజ్రత్ సహల్ బిన్ సఅద్ (ర) గారి కథనం- దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: “చివరి కాలంలో ప్రజల్ని భూమిలో కూర్చడం జరుగుతుంది. వారిపై రాళ్ళ వర్షం కురిపించడం జరుగుతుంది. వారి ముఖాల ను వికృతంగా మార్చేయడం జరుగుతుంది”. అది విన్న సహాబా (ర) ‘ఓ అల్లాహ్ ప్రవక్తా! అలా ఎప్పుడు జరుగుతుంది?’ అని ప్రశ్నించగా- “సంగీత వాయిద్యాలు సర్వసాధారణం అయిపోనప్పుడు, పాటలు పాడే పడతులు పెచ్చు పెరిగిపోయినప్పుడు, అన్ని రకాల మద్యాన్ని ధర్మసమ్మతంగా చేసుకున్నప్పుడు” అని సమాధానమిచ్చారు. (ఇబ్ను మాజహ్)

మరికొన్ని ఉల్లేఖనాల్ని పరిశీలించినట్లయితే మనముందు వచ్చే కారణాలు- బంధుత్వ సంబంధాల విచ్ఛితికి మనిషి పాల్పడినప్పుడు, సమాజంలోని సంపన్న వర్గాలలో పిసినారి తనం ప్రబలినప్పుడు, అయోగ్యులకు జాతి బాధ్యత, ప్రభుత్వ పగ్గాలు అప్పగించినప్పుడు, సమాజ శ్రేయస్సు, ప్రజా సంక్షేమం గురించి అలగా జనాలు వాగ్బాణాలు సంధించి నప్పుడు, మద్య సేవనం, మగువ లోలత్వం, అశ్లీలత, అధిగ మయినప్పుడు, నీచ మానవులు ధర్మాధిపతులుగా చెలామణి అయినప్పుడు, ధర్మాధర్మాల నిమిత్తం లేకుండా యధేచ్ఛగా తీర్పులు చేసినప్పుడు, వ్యభిచారం, వడ్డీ సర్వసాధారణమయి పోయి నప్పుడు, మస్జిద్ ముందు నుండే వెళుతూ కూడా రెండు రకాతుల నమాజు చదవాలన్న ఆలోచన సయితం మనిషికి కలగనప్పుడు, సమా ధులు, చెట్లు, వీరుల విగ్ర హాలు, చిత్రపటాలను ప్రతిష్టింపజేసి పూజలు- చదివింపులు జరిపినప్పుడు, ఖుర్‌ఆన్ ఆదేశాలను, ప్రవక్త (స) వారి సంప్రదాయాలను ప్రక్కనబెట్టి అన్య జాతుల సంస్కృతి సంప్ర దాయాలకు అగ్ర తాంబూలం ఇచ్చినప్పుడు, మోసకారులు గొప్ప లౌక్యం గల వాళ్ళుగా చెలామణి అయినప్పుడు, ధర్మా సనం న్యాయబద్ధమయిన తీర్పులు ఇవ్వనప్పుడు, మాట తప్పడం మామూలయి పోయినప్పుడు, మంచిని మంచి అనడం చెడును చెడు అనడం మానేసి, చెడును మంచిగా, మంచిని చెడుగా ప్రచారం చేసినప్పుడు, మానవతే మొత్తం మంటగలసినప్పుడు, ఈ ఘోరాలను చూడలేక, చూసి తాళలేక బతకడంకన్నా చావే నయం అనుకున్నప్పుడు, సిగ్గును అమ్మేసి, మానం, మర్యాదను తగలేసి దారి ప్రక్కనే పురు

షుడు స్త్రీతో రతిక్రీడలో పాల్గొన్నప్పుడు, ధర్మం మీద నడవటం అరచేతిలో నిప్పుకణికను పట్టుకున్నంత కష్టతరమయిపోయి నప్పుడు, సిగ్గొదిలి జనాలకే ప్రజలు జేజేలు పలికినప్పుడు, వ్యభిచారులకు, నేరస్థులకు సభలు సమావేశాలు ఏర్పాటు చేసి ఘనంగా సన్మానాలు చేసినప్పుడు- భూకంపాలు, అల్ల కల్లోలం, ఉపద్రవాలు చోటు చేసుకుంటాయి. ఇదంతా ఎందుకు ఎందుకు జరుగుతుంది అంటే దానికి ఖుర్‌ఆన్ సమాధానిమిస్తోంది:

"ప్రజలు చేజేతులా చేసుకున్న (పాప) కార్యాల మూలంగానే భూమిలోనూ, సముద్రంలోనూ కల్లోలం వ్యాపించింది". (అర్రూమ్: 41)

నిజమేమంటే- పుడమి ప్రకంపించినా, ఆకాశం ప్రకోపించినా, మన పై భూమ్యాకాశాల నుండి ఏ కడగండ్లు వచ్చి పడినా అవన్నీ మనందరి స్వయంకృతాపరాధాల ఫలమే. మరి చూడ బోతే అల్లాహ్ ఎంతో ఉదాత్తుడు. చాలా మటుకు మన పాపాలను, నేరాలను, ఘోరాలను మన్నించి వదిలి పెట్టేస్తు న్నాడు. ఆయన తన దాసుల యెడల గొప్ప క్షమాగుణం కలవాడు. అలా కాకుండా ప్రతి చిన్న విషయానికి ఆయన మనల్ని పట్టుకోదలిస్తే మనం బ్రతికి బట్ట కట్టడం కల్లే. ఖుర్‌ఆన్ ఇలా అంటుంది: "అల్లాహ్ గనక ప్రజల ఆకృత్యా లపై అప్పటికప్పుడే పట్టుకోవడం మొదలెడితే పుడమిపై సంచరించే ఏ ప్రాణీ మిగిలి ఉండదు."(ఫాతిర్:45) "నిజంగా ఆయనయితే (వాటిలోని) చాలా విషయాలను మన్నిస్తూ ఉంటాడు". (షూరా: 30)

మన రోజువారి జీవితంలో ఎన్నో సంఘటనల్ని మనం చూస్తూ, ఎన్నో వార్తల్ని వింటూ కూడా మనం గుణపాఠం గ్రహించడం లేదు. మహనీయ ముహమ్మద్ (స) ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు భయకంపితులయ్యే వారు. హజ్రత్ అబూ బకరహ్ (ర) గారి కథనం-

మేమోసారి దైవప్రవక్త (స) వారి దగ్గర ఉన్నప్పుడు సూర్య గ్రహణం సంభవించింది. ప్రవక్త (స) కంగారు కంగారుగా లేచి తన దుప్పటిని లాక్కుంటూ మస్జిద్ వైపు సాగి పోయారు". (బుఖారీ)

"విపరీత గాలులు వీచినా, ఆకాశం మీద దట్టమయిన మేఘాలు ఏర్పడినా ఆయన కంగారు పడుతూ ఓసారి ఇంటి లోపలికి ఓసారి ఇంటి బయటికి వచ్చేవారు. ముందుకెళ్ళే వారు వెనక్కి వచ్చేవారు. ఆయన ముఖ కవళికలు మారి పోయేవి. వాన కురియగానే ఆయన సంతోషించేవారు". (ముస్లిం)

ఓ సారి విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర.అ) ఈ విషయ మయి ఆరా తీయగా- ఆయనన్నారు: "ఓ ఆయిషా (ర)! అందులో ఆపద లేదన్న గ్యారంటీ ఏమిటి?! ఒకానొక జాతి ఈ పెనుగాలి ద్వారానే సర్వ నాశనం చేయబడింది. ఆ జాతి వారు కూడా ఆ మేఘాన్ని చూసి "ఇది మాపై వర్షాన్ని కురి పించే మబ్బుతునక" అని మురిసిపోయారు" అని సమాధాన మిచ్చారు. (బుఖారీ)"

కాదు నిజానికది మీరు తొందర పెట్టిన (శిక్ష తాలూకు) మేఘ మది. అదొక పెనుగాలి. అందులో వ్యధాభరితమయి శిక్ష ఉంది." (అల్ అహ్ఖాఫ్: 24)

వేరొక ఉల్లేఖనం ప్రకారం గాలులు తీవ్రంగా వీస్తున్నప్పుడు ఆయన (స) ఈ విధంగా వేడుకునేవారు: "ఓ అల్లాహ్! దీని మేలు, దీనిలో ఉన్న మేలు, ఏ మేలుతోనయితే అది పంప బడిందో ఆ విషయమయి నిన్ను అర్థిస్తున్నాను. ఇంకా దాని కీడు నుండి, అందులో దాగి ఉన్న కీడు నుండి, ఏ చెడు తోనైతే అది పంపబడిందో దాని నుండి నేను నీ శరణు వేడు కుంటున్నాను".

ఇబ్ను అబుద్దున్యా ముర్సల్ కథనం- ఓసారి ప్రవక్త (స) వారి కాలంలో పుడమి ప్రకంపించ సాగింది. అప్పుడు దైవ ప్రవక్త (స) భూమిపై తన చేయి పెడుతూ- "శాంతం, శాంతం! ఇంకా నీ సమయం రాలేదు అని చెప్పి ప్రజలవైపు తిరిగి ఇలా అన్నారు: "ప్రజలారా! మీ ప్రభువు మీ పట్ల అప్రసన్ను డయి ఉన్నాడు. కాబట్టి త్వరగా ఆయన్ను రాజీ పరచుకోండి, త్వరగా ఆయన్ను ప్రసన్నుడ్ని చేసుకోండి".

ఇప్పటికి మించి పోయించి ఏమి లేదు. మనం మారడానికి, మన సమాజాన్ని సంస్కరించుకోవడానికి సమయం ఉంది. కానీ ప్రళయ శంఖం పూరించబడితే మాత్రం ఆ కాసింత వ్యవధి కూడా మన కుండదు. అల్లాహ్ ఇలా అంటున్నాడు: "ఓ ప్రజ లారా! మీ ప్రభువుకు భయ పడండి. నిశ్చయంగా ప్రళయ ప్రకంపనం మహా భయంకరమయినది. ఆనాడు మీరు దాన్ని చూస్తారు. పాలు పట్టే ప్రతి తల్లీ పాలు త్రాగే తన పసి కందుని మరచిపోతుంది. గర్భవతుల గర్భాలు పడిపోతాయి. ప్రజలు మైకంలో తూలుతున్నట్లు నీకు కన్పిస్తారు. వాస్తవానికి వారు మైకంలొ ఉండరు. అయితే అల్లాహ్ విపత్తు అత్యంత తీవ్రంగా ఉంటుంది". (అల్ హజ్జ్: 1,2) ✤

# సిసలైన తాత్విక ఆలోచనా విధానం నేర్పే గ్రంథం




– ముహమ్మద్ అలీ జిన్నా

ఇటీవల తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ నుండి ప్రచురించి విడుదల చేసిన పుస్తకం "మారుతున్న ప్రపంచం- ఇస్లామీయ ఆలోచనా విధానం". ఈ పుస్తకాన్ని సయ్యిద్ సాదతుల్లాహ్ హుసైనీ ఉర్దూ భాషలో 'బదల్తీహుయి దునియా ఔర్ ఇస్లామీ ఫిక్ర్' అనే శీర్షికతో రచించారు. ఈ పుస్తకాన్ని సోదరి బతూల్ హుమైర్వీ తెలుగులో అనువాదం చేశారు. ఈ పుస్తకంలో పదకొండు టాపిక్‌లను గురించి రచయిత చర్చించారు. ఈ పుస్తకం 'ముందుమాట'లో పుస్తక పరిచయాన్నిస్తూ ఇస్లామీయ ఉద్యమంలో సైద్ధాంతిక చర్చనీయాంశమైన కొన్ని కోణాలు, వ్యాసాలు, ప్రసంగాల సంపుటి ఈ పుస్తకమన్నారు. గత ఏడెనిమిది సంవత్సరాలుగా జరిగిన ప్రసంగాలు, పత్రికలలో ప్రచురితమైన వ్యాసాలు, వీడియోల రూపంలో సోషల్ మీడియాలో వైరల్ అయిన అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు.

"ఇస్లాం సంస్కృతీ సౌరభాలు" ఈ శీర్షికలో అసలు సంస్కృతి అంటే ఏమిటి? ఇస్లాం సాంస్కృతిక పునాదులు, ఇస్లామీయ సాంస్కృతిక విశిష్ఠతలు, ఇస్లాం సంస్కృతి దృశ్యమాలికలు, ఆధునిక బహుళ సమాజాలలో ఇస్లాం అవలంబించే విధానం అనే ఉపశీర్షికలు న్నాయి. ఇస్లామీయ సాంస్కృతిక విశిష్టతల్లో ఎనిమిది నియమాలను పేర్కొన్నారు. 1) ఏకేశ్వరోపాసన 2) ఆశయ స్పృహ 3) బాధ్యతాయుత భావన 4) శాశ్వత సుస్థిర విలువలు 5) మంచి విషయాలను గ్రహించే గుణాత్మక సౌందర్యం 6) విశ్వజనీన సౌభ్రాతృత్వం 7) లజ్జా వ్రీడల భావన 8) మానవ సాఫల్యం. వీటి గురించి విపులంగా చర్చించారు.

"బహుళ సమాజాలలో ముస్లిం సమాజ బాధ్యతలు". ఇందులో ఇస్లామీయ చరిత్ర- బహుళ సమాజాలు, బహుళ సమాజాలు- ఆధునిక యుగం, ఇస్లామీయ దృక్పథం, ఇస్లాం కాంక్షించే బహుళ సమాజ విశిష్టతలు, ముస్లిం సమాజ బృహత్తర బాధ్యత అనే ఉప శీర్షికలున్నాయి.

తర్వాత అతి ముఖ్యమైన అంశం ఉంది. ఇది పూర్తిగా తత్వశాస్త్రం పైనే ఆధారపడి ఉంది. "సెక్యులరిజం- ఇస్లామీయ ఉద్యమం" అనే శీర్షికను ప్రతీ ఒక్కరు తప్పక అధ్యయనం చేయాలి. లౌకికవాదం ప్రాథమిక అర్థం, సెక్యులరిజం వివిధ రూపాలు, అమెరికా బ్రిటన్‌ల సెక్యులరిజం, సెక్యులరిజం- భారతదేశం, లౌకికరాజ్యంతో ఇస్లామీయ ఉద్యమ సంబంధం అనే ఉప శీర్షికలతో ఈ టాపిక్‌కు పూర్తిస్థాయి న్యాయం చేశారు రచయిత. మనం అనునిత్యం "సెక్యులరిజం (లౌకికవాదం)" అనే పదాన్ని చర్చా గోష్టుల్లో వింటూ ఉంటాము. దీనికి గల అసలైన భావం ఎవరెవరి వద్ద ఎలా ఉపయోగించబడుతుందో చక్కగా వివరించారు. నేషనలిజం, వలసవిముక్తి వాదం, ఇస్లామీయ ఉద్యమం- సైద్ధాంతిక సవాళ్ళు వంటి అంశాలు వివరించారు.

తొమ్మిదవ అంశం,"ఇస్లామీయ ఉద్యమ సాహిత్యం- దాని ముందున్న శాస్త్రీయ సవాళ్ళు" భారతదేశంలో ఇస్లామీయ ఉద్యమం ఏ ఏ అంశాలలో విజ్ఞానపరమైన కృషి చేయాల్సిన అవసరం ఉందో ఈ వ్యాసంలో సూచించారు. కొత్తగా రచనలు చేసేవారు ఏ ఏ అంశాలపై చేయాల్సిన అవసరం ఉందో రచయిత విశ్లేషణాత్మకంగా వివరించారు. ఇంకా ముస్లింల జీవనంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక అంశాలు ఇందులో చర్చించారు.

పదో అంశం, "సంప్రదాయ వాదం, ఆధునిక వాదం- మౌలాన మౌదూదీ(రహ్మ) మధ్యేమార్గం" ఇందులో సనాతన వాదంపై మౌలానా మౌదూదీ(రహ్మ), ప్రాధాన్యతల పరిజ్ఞానం, బౌద్ధిక

ఆధిపత్యం, మానవ ఆలోచనా విధానంలోని ప్రధాన విశిష్టత, విద్యాబోధనల విషయం, సాంకేతిక, ఆధునిక వనరులు, ఆర్థిక రాజకీయ వ్యవస్థలు, కార్యరంగ విధి విధానాలు అనే ఉప శీర్షికలు న్నాయి. మౌలానా మౌదూదీ(రహ్మ) టెక్నాలజీని ఒక సమతుల్యా త్మకమైన విషయంగా భావించారు. అసలు లోపం టెక్నాలజీలో లేదు, టెక్నాలజీని వినియోగించే సంస్కృతిలో ఉందనేది ఆయన ఉద్దేశ్యం, దీన్ని చక్కగా వివరించారు. ఆధునిక వాదంలో ఉన్న సానుకూల అంశాల గురించి మౌలానా మౌదూదీ(రహ్మ) స్ట్రాటజీని అవగాహన చేసుకునేందుకు ఇమాం మహదీ గురించి ఇలా అన్నారు : "నా అంచనా ప్రకారం ఇమాం మహదీ తన కాలంలో అత్యాధునిక విధానాన్ని అవలంబించే నాయకుడే కాక ఆ కాలంలోని అన్ని ఆధునిక శాస్త్రాలపై అంతర దృష్టిని కలిగి ఉంటారు. జీవితంలోని అన్ని రకాల సమస్యలను బాగా అవగాహన చేసుకునేవాడై ఉంటారు. తన మేథోశక్తి, రాజకీయ దూరదృష్టి, తన పోరాట స్ఫూర్తితో ప్రపంచమంతటా తనదైన ముద్రను వేస్తాడు. తన కాలంలోని ఆధునిక వాదులందరికీ ఆదర్శంగా మనగలుగుతాడు. అతని ఆవిష్కరణలకు వ్యతిరేకంగా సూఫీలు, మౌల్వీలే ఎక్కువగా తిరగబడుతున్నారని నేను భయపడుతు న్నాను. అంతిమంగా అతను అజ్ఞాన శక్తియుక్తులను కూలదోసి, అత్యుద్భుతమైన ఇస్లామీయ రాజ్యాన్ని స్థాపిస్తారు. అందులో ఒకవైపు ఇస్లాం స్ఫూర్తి, సహజత్వాలు ఉట్టిపడుతుంటే మరోవైపు శాస్త్రీయ పురోగతి అంబరాన్ని తాకుతుంది.

పదకొండవ అంశం, "ధర్మసంస్థాపనా దృక్పథంపై అభ్యంతరాలు-స్థూల పరిశీలన" ధర్మసంస్థాపన కార్యం కేవలం దైవప్రవక్త(స)పైనే ఉంది. ఇతర ముస్లింలకు దీంతో సంబంధం లేదు అనే ప్రచారానికి ఇందులో జవాబిచ్చారు.

ఈ పుస్తకం ఫిలాసఫీ ఆధారంగా రచించబడింది. ఈ పుస్తకంలో అనేకానేక అంశాలున్నాయి. దీని గురించి ఒకటి రెండు వాక్యాలలో అసలు చెప్పలేము. దీన్ని పూర్తిగా చదివితేనే పూర్తి అవగాహన కలుగుతుంది. ఈ మధ్యకాలంలో ఇలాంటి పుస్తకాలు చాలా తక్కువే వచ్చాయి. తత్వశాస్త్రం చాలా కఠినమైన సబ్జెక్టు. దీన్ని ఉర్దూ భాష నుంచి తెలుగులో అనువదించడం కత్తిమీద సాము లాంటిదే. ఇంత కఠినమైన సబ్జెక్టును కూడా అనువాదకురాలు సోదరి బతూల్ హుమైర్వీ సులువైన, సరళమైన భాషలో పాఠకు లకు అర్థమయ్యే రీతిలో చక్కగా అనువదించారు. దైవం ఆమె కృషిని అంగీకరించి ఇహపరలోకాల సాఫల్యాన్ని అందించుగాక! ఆమీన్

# కంభం పట్టణంలో నిత్యావసరాల పంపిణీ




ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో జమాఅతె ఇస్లామీ హింద్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో 2023 ఏప్రిల్ 1వ తేదీన 'రమజాన్ శుభాలు' అంశంతో ఏ.బి (అయ్యూబ్) ఫంక్షన్ హాల్‌లో సామూహిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జమాఅతె ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ రఫీఖ్ మాట్లాడుతూ– "మానవులలో దైవం పట్ల భయభక్తులు జనించి, నైతికంగా పరివర్తన చెందాలన్నదే ఉపవాసాల ముఖ్య ఉద్దేశమని" తెలిపారు. ఈ శుభాల మాసంలో అనాథలు, బీదసాదలకు ఇతోధికంగా సహాయ సహకారాలు అందించాలని, సంఘ సేవా కార్యక్రమాలలో పాలుపంచుకుని ప్రజలకు చేదోడు వాదోడుగా నిలవాలని ఆయన కోరారు. జెఐహెచ్ జిల్లా అధ్యక్షుడు ముహమ్మద్ గౌస్ ఖాన్ మాట్లాడుతూ– "జమాఅతె ఇస్లామీ హింద్ గత డెబ్బై ఐదు సంవత్సరాల నుండి సామాజిక, ధార్మిక, సేవా కార్యక్రమాలను కులమతాలకతీతంగా చేపడుతూ వస్తుంది. అదేవిధంగా కరోనా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో దేశ వ్యాప్తంగా నిరుపేదలు, అవసరార్థులకు కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు".

దాదాపు 200 మంది పాల్గొన్న ముస్లిం, ముస్లిమేతర సోదరులకు ఉపవాస విరమణ కోసం అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది. మగ్రిబ్ నమాజ్ అనంతరం స్థానిక బాధ్యులు ముహమ్మద్ రఫీ అందరికీ కమ్మని విందు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 100 మంది నిరుపేద ముస్లిం సోదరులకు రమజాన్ కిట్స్ (పది రకాల నిత్యావసర వస్తువు)లను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహా మండలి సభ్యులు అష్రఫ్ అలీ, యమ్.పి.జె రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖదీర్, ముఫ్తీ యాసీన్, అల్తాఫ్ హుస్సేన్ ఖాన్, అబ్దుల్లా ఖాన్, ఆసిఫ్ ఖాన్, అబ్దుల్ జలీల్, రసూల్ బేగ్, జమాఅతె ఇస్లామీ హింద్ సభ్యులు, కార్యకర్తలు, కంభం పట్టణ ముస్లింలు పాల్గొన్నారు.

**రిపోర్టింగ్ :- ముహమ్మద్ గౌస్ ఖాన్**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

54 ఆయత్‌లు

# 41. హా మీమ్ అస్ సజ్దా

మక్కా అవతరణ

40–42 ఎవరయితే మా ఆయత్‌లకు వక్రభావాలు తొడుగుతారో వారు మాకు గోప్యంగా ఏమీలేరు.[50] మీరే ఆలోచించుకోండి, అగ్నిలో పడవేయబడబోతున్న వ్యక్తి మేలా లేదా ప్రళయదినాన శాంతియుత స్థితిలో హాజరయ్యే వ్యక్తియా? మీకు ఇష్టమయినది మీరు చేస్తూ ఉండండి, మీ చేష్టలన్నింటినీ అల్లాహ్ గమనిస్తూనే ఉన్నాడు. ఈ జనులు ఎటువంటి వారంటే, హితబోధనా వచనం వీరి ముందుకు వచ్చినప్పుడు వీరు దాన్ని నమ్మడానికి నిరాకరించారు. కాని వాస్తవమేమిటంటే ఇది ఒక బలవత్తరమయిన గ్రంథం,[51] మిథ్య దీని మీదికి దీని ముందు నుంచీ రాజాలదు, వెనక నుంచీ రాజాలదు,[52] ఇది విజ్ఞుడు, స్తవనీయుడు అవతరింపజేసినది.

43 ప్రవక్తా, నీకు చెప్పబడుతున్న దానిలో నీకు పూర్వం గతించిన దైవసందేశహరులకు చెప్పబడని విషయం ఏదీ లేదు. నిస్సందేహంగా నీ ప్రభువు ఎంతో క్షమాగుణం గలవాడు,[53] అంతేకాదు ఎంతో వ్యధాభరిత శిక్ష నిచ్చేవాడు కూడా.

50. ఈ పదాలలో ఒక తీవ్రమయిన బెదరింపు దాగి ఉంది. సాధికార పాలకుడు, ఒక వ్యక్తిని గురించి, ఫలానా వ్యక్తి చేస్తున్నదంతా నాకు కనుమరుగయి లేదు అని అనడంలోనే, ఇక అతను తప్పించుకుపోలేడు అన్న అర్థం ఇమిడి ఉంది.

51. అంటే, ఇది అచంచలమయినది. మిథ్యావాదులు దీనికి వ్యతిరేకంగా అవలంబిస్తున్న పన్నాగాలతో దీన్ని ఓడించడం అన్నది కాని పని. ఇందులో సత్యతా బలముంది. సత్యజ్ఞాన శక్తి ఉంది, ఆధారాలు, వాదనల సత్తా ఉంది, భాష, భావ ప్రకటనా పటిమ ఉంది. దీన్ని పంపే దేవుని దైవత్వపు అండ దండలున్నాయి, దీన్ని అందజేస్తున్న ప్రవక్త వ్యక్తిత్వపు సత్తువ ఉంది. అబద్ధం, జీవంలేని ప్రాపగండా ఆయుధాలతో ఎవరయినా దీన్ని చిత్తు చేయాలని అనుకుంటే ఎలా సాధ్య మవుతుంది?

52. ముందు నుంచి రాజాలదు అంటే, దివ్య ఖుర్‌ఆన్‌పైన నేరుగా దాడిచేసి ఎవరయినా దాని మాటను దేన్నయినా తప్పయినదిగా, దాని బోధనను దేన్నయినా అసత్యమయి నదిగా, భ్రష్టయినదిగా నిరూపించదలిస్తే అందులో సఫలం కాలేరు అని అర్థం. వెనక నుండి రాజాలదు అని అంటే భావం, ఖుర్‌ఆన్ ముందుంచే యదార్థాలకు భిన్నమయిన ఏ వాస్తవికతగాని, ఏ సత్యతగాని ఆవిష్కృతం కాజాలదన్నమాట. ఖుర్‌ఆన్ అందజేసిన జ్ఞానాన్ని ఖండించే జ్ఞానం, అది నిజంగా "జ్ఞానం" అయినది ఏదీ వెలుగులోకి రాజాలదు. ఏ అనుభవ మయినా, ఏ పరిశీలన అయినా, ఖుర్‌ఆన్ విశ్వాసాలను, నైతికత, న్యాయశాస్త్రం, సంస్కృతీ నాగరికతలు, ఆర్థిక సామాజిక విధానాలు, నాగరిక రాజకీయాలలో మానవునికి అది అందజేసిన మార్గబోధనలను తప్పయినవిగా నిరూపించ లేవు అన్నమాట. ఈ గ్రంథం దేన్ని సత్యమయినదిగా ప్రకటి స్తుందో అది ఎన్నటికీ అసత్యంగా రుజువు కాజాలదు. దేన్ని ఇది మిథ్య అని అంటుందో అది ఎన్నటికీ సత్యమయి నిలుచోజాలదు. అంతేకాక మరో భావం ఏమిటంటే, మిథ్య దీనికి ముందు నుంచి దాడిచేసినా, డొంక తిరుగుడు దారుల గుండా వచ్చి దండెత్తినా ఎట్టి పరిస్థితిలోనూ ఖుర్‌ఆన్ అంద జేసే ఈ సందేశాన్ని ఓడించజాలదు. సమస్త వ్యతిరేకతలు, విరోధుల సకల రహస్య, బహిరంగ ఎత్తుగడలకు ప్రతిగా ఈ సందేశం వ్యాప్తిచెంది తీరుతుంది, మరెవరూ దీన్ని ఓడించజాలరు అని అర్థం.

53. అంటే, ఇది ఆయన సహనం, నిగ్రహం, మన్నింపు, చూపోపుల కారణంగానే తన సందేశహరుల్ని తిరస్కరించినా తిట్టినా, బాధలు పెట్టినా ఆయన సంవత్సరాల తరబడి విరోధు లకు గడువునిస్తూ పోయాడు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ [أَحَادِيثِ] الأَنْبِيَاءِ

## 1. దైవప్రవక్తల (హదీసుల) ప్రకరణం

**37)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు : "వాస్తవానికి విశ్వసించిన వారికీ, తమ విశ్వాసాన్ని ఆత్మ ద్రోహం (జుల్మ్)తో కలుషితం చేయని వారికే శాంతి. వారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నారు" **(6: 82)** అనే ఆయత్ అవతరించినప్పుడు, 'దైవప్రవక్తా! మాలో తన ఆత్మకు అన్యాయం చేయని వాడె వడుంటాడు?' అని మేము సందేహపడ్డాము. దానికి సమాధానంగా ఆయన(స) ఇలా అన్నారు: "మీరు ఊహించుకుంటున్న విషయం కాదది. 'ఎవరయితే తమ విశ్వాసాన్ని జులుంతో కలుషితం చేసుకున్నారో...' అనే ఆయత్‌లోని జులుం అంటే షిర్క్ (బహు దైవోపాసన) అని అర్థం. ఏమిటి, మీరు మహనీయ లుక్మాన్ తన కుమారునికి చేసిన ఉపదేశాన్ని వినలేదా? 'ఒరేయ్ అబ్బాయి! అల్లాహ్‌కు భాగస్వామ్యం కల్పించకు (షిర్క్ చేయకు). షిర్క్ చాలా పెద్ద అన్యాయం' అని ఆయన ఉపదేశించారు."

### అధ్యాయం : 10

### అల్ హిజ్ర్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు

వారికి ఇబ్రాహీమ్ అతిథుల గాథను కొంచెం వినిపించు. వారు అతని వద్దకు వచ్చి, "మీకు శాంతి కలుగుగాక" అని అన్నప్పుడు, అతనిలా అన్నాడు: "మేము మిమ్మల్ని చూచి భయపడుతున్నాము." వారు ఇలా సమాధానం పలికారు : "భయపడకండి..." ***(అల్ హిజ్ర్ 51-53)***

"ఓ నా ప్రభూ! నీవు మృతులను ఏ విధంగా బ్రతికిస్తావో నాకు చూపించు" అని ఇబ్రాహీము తన ప్రభువును అడిగిన సందర్భాన్ని స్మరించుకోండి". ***(అల్ బఖరా : 260)***

**48)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "మనం మహనీయ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) కన్నా ఎక్కువగా సందేహం వ్యక్తం చేయడానికి హక్కుదారులం. ఎందుకంటే మృతులను బ్రతికించే విషయంలో ఆయనకు కలిగిన సందేహాన్ని స్మరించుకొనండి– 'ఓ నా ప్రభూ! నీవు మృతులను ఏ విధంగా బ్రతికిస్తావో నాకు చూపించు' అని ఇబ్రాహీమ్ అడిగినప్పుడు, 'నీకు విశ్వాసం లేదా?' అని అల్లాహ్ అడిగాడు. ఇబ్రాహీమ్ వినయంగా ఇలా అన్నాడు: 'నాకు విశ్వాసం అయితే ఉంది. కాని మనస్సును తృప్తిపరచటం కోసం అడుగుతున్నాను.' ఇంకా లూత్ (అలైహిస్సలామ్)పై అల్లాహ్ దయజూపుగాక! ఆయన గట్టి మూలాధారాన్ని (అంటే నిజప్రభువును) ఆశ్రయించారు. ఇకపోతే యూసుఫ్ (అలైహిస్సలామ్); ఆయన కారాగారంలో ఉన్నంత కాలం నేను గనక ఉండి ఉంటే, నేను విడుదల కోసం పిలిచినవాని మాటను తప్పకుండా అంగీకరించి ఉండేవాణ్ణి."[1]

48-1. అంటే జైలు నుండి విడుదల అవటం మహాభాగ్యం అని భావించి ఉండేవాణ్ణి. మహనీయ యూసుఫ్ (అ) సహన గుణానికి జోహార్లు. ఆయన సుదీర్ఘ కాలంగా జైలులో మగ్గుతూ ఉన్నప్పటికీ, రాజుగారి నుండి అందిన విడుదల కబురుపై ఏమాత్రం తొందరపడలేదు. అసలు తాను చేసిన నేరం ఏమిటో ముందు రుజువు కావాలన్నారు. అంతిమ దైవప్రవక్త(స) వినయం కొద్దీ మహనీయ యూసుఫ్(అ) గురించి అలా వ్యాఖ్యానించారు. అంటే యూసుఫ్(అ) గొప్పతనాన్ని నొక్కి వక్కాణించారు.

# ఘన విజయం

67

సచ్చరిత పత్రాలు



- ఎస్.ఎమ్. మలిక్

## మక్కా పుణ్యపురిలో ప్రవేశం

హిజ్రీ 8వ సంవత్సరం, రమజాన్ నెల, 17వ తేదీన ఇస్లామీయ యోధులు పదివేల మంది మక్కావైపునకు ప్రస్థానం చేశారు. అబూ సుఫ్యాన్ అప్పుడే ఇస్లామ్ స్వీకరించిన వ్యక్తి. అతనికి ముస్లిముల శక్తిని పరిచయం చేయడానికి, ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్), మహనీయ అబ్బాస్(ర)ని కోరారు. పర్వత కనుమల మధ్యగా ఇస్లామీయ సైన్యం సాగుతున్నప్పుడు ఆ కొండ ఎత్తయిన స్థలంలో అబూ సుఫ్యాన్‌ని నిలబెట్టి సేనను పరిశీలించే అవకాశం కల్పించవలసిందిగా అబ్బాస్(ర)ని కోరారాయన(స).

మహనీయ అబ్బాస్(ర) అలాగే చేశారు. ఒక్కొక్క దళం ఆ కనుమ గుండా వెడుతున్నప్పుడు, ఒక్కొక్క దాన్ని దాని ధ్వజం ద్వారా తెగ పేరున పరిచయం చేశారు అబ్బాస్(ర). అలా సాగుతున్నపుడు, మహనీయ సఅద్ బిన్ ఉబాద (ర), అన్సారుల ధ్వజ వాహకులు, అబూ సుఫ్యాన్‌ని చూసి, ఇస్లామీయ అభిమానం వల్ల ఉత్తేజితులయి "నేడు దెబ్బ తీసే దినం, రక్తం చిందించే దినం, నేడు పవిత్ర దైవ గృహంలోనూ రక్తం చిందించడం ధర్మసమ్మతం" అన్నారు. ప్రవక్త శ్రీ(స)కి ఈ మాటలు నచ్చలేదు. ఆయన ధ్వజం ఆయన్నుండి తీసుకుని ఆయన కుమారుడు, మహనీయ ఖైస్ బిన్ సఅద్‌కు అప్పజెప్పారు.

మక్కాలోకి నలువైపుల నుండి ప్రవేశించి, నగరాన్ని చుట్టు ముట్టడానికి ప్రవక్తశ్రీ(స), విభిన్న దళాల సైన్యాన్ని జీతువా అనే చోట పునః వ్యవస్థీకరించి, మహనీయులు అబూ ఉబైదా బిన్ జర్రాహ్, జుబైర్ బిన్ అవామ్, ఖాలిద్ బిన్ వలీద్, ఖైస్ బిన్ సఅద్(రజి) నలుగురి నేతృత్వంలో ప్రత్యేక క్రమం ప్రకారం నగరంలో ప్రవేశం చేందుకు ఆదేశించారు. స్వయంగా ప్రవక్త మహనీయులు(స) మక్కాలోకి ఉత్తర దిశ నుండి ప్రవేశించారు. ప్రవేశించే సమయాన ఆయన(స) శిరస్సు దైవసన్నిధిలో వినమ్రమయి, ఏ మేరకు తలవంచారంటే ఆయన గడ్డం ఒంటెపైని తొట్లకు తాకుతూ ఉండేది, ప్రవక్త(స)లో అణకువ, వినమ్రత, ఆరాధనా భావం, అభివందనా భావం తొణికిసలాడుతూ ఉండేది. అప్పుడు ఆయన(స) నోరు దేవుని స్తోత్ర గానం చేస్తూ ఉండేది.

ఆ సందర్భాన ఖురైషీల పక్షాన కొంత ప్రతిఘటన ఎదురయింది. ఖురైష్‌లోని తుంటరి మూక ఎదుర్కొంది. ఇద్దరు ముస్లిములూ

షహీదులవగా 12 మంది బహుదైవారాధకులూ హతులయ్యారు. ఆ సమయాన అబూ సుఫ్యాన్ ప్రవక్త సన్నిధికి వచ్చి, "దైవప్రవక్తా! కురైష్ యువపుత్రులు నరకబడుతున్నారు. నేటి తరువాత కురైష్ నామరూపాల్లేకుండా సమసిపోతుంది" అని ఆవేదన వెలిబుచ్చారు. ప్రవక్త మహనీయులు, విశ్వకారుణ్యమూర్తి, ఇది విని, మక్కా వాసులకు సర్వ సామాన్య ఆశ్రయం ప్రకటించారు. ఇది తెలుసుకుని అన్సారులు (మదీనా వాసులు), ప్రవక్త్తశ్రీ(స) మనస్సు తన జాతి వైపునకు మొగ్గుచూపుతోంది అని అనుకున్నారు. వారు తమలో అనుకున్నారు, 'ప్రవక్త్తశ్రీ(స) కూడా మానవులే కదా, తన వంశం వారిని వెనుక వేసుకువచ్చారు'.

## "నేను మీ వాడినే"

దైవ సందేశహరులకు ఈ చర్చల సమాచారం తెలిసింది. ఆయన అన్సారుల్ని సమావేశపరిచారు. 'వంశం వారి ప్రేమ నన్ను ఏమాత్రం ఆకర్షించలేదు. నేను కేవలం దేవుని దాసుణ్ణి, ఆయన సందేశహరుణ్ణి మాత్రమే. దైవం కొరకే నేను మీ వద్దకు హిజ్రత్ చేసి వచ్చాను. నా జీవన్మరణాలు ఇక మీతోనే ముడివడి ఉన్నాయి'. ప్రవక్త ఆనాడు చెప్పిన మాటను తు.చ తప్పకుండా పాటించారు. మక్కా విజయానంతరం, తాను మదీనాకు వలసపోయిన కారణం సమసిపోయినా, ఆయన(స) మదీనా, తన స్వంత నగరంలో నివసించడానికి ఇష్టపడలేదు, మక్కాపైకి జరిపిన దాడి ఆయన(స) ఏదో స్వదేశాభిమానంతోనో, లేదా మక్కావాసుల మీద ప్రతీకారం తీర్చుకునేందుకో కాదు, కేవలం సత్యవాక్కు సమున్నతి మాత్రమే దాని ఉద్దేశం.

మక్కా తన స్వస్థలమే అయినా ఇక్కడ తన స్వంత ఇల్లు ఉన్నా, మక్కాను ఆయన తన బలాధిక్యతతో జయించినా, అక్కడ ఇక ఆయన(స)కు ప్రతి విషయం మీద, ప్రతి వస్తువు మీద అధికారం లభించినా ఆయన స్వంత ఇంటిని తన స్వగృహంగా అంగీకరించడానికి నిరాకరించారు. ఆయన మక్కాలోని ఓ వీధిలో తన గుడారు వేసుకుని అక్కడే గడిపారు.

## సత్యం ఆగమనంతో మిథ్యా సమసిపోయింది!

నలు దిశల నెమ్మది నిండిన తరువాత విశ్వ నాయకులు, మహనీయ ముహమ్మద్ తన విడిది నుండి బయటకు వచ్చి బైతుల్లాహ్, దైవగృహం చేరారు. ఆయన ఒంటె తన వాహనం మీదనే కూర్చొని కాబా ప్రదక్షిణలు, ఏడుమార్లు చేశారు. ప్రదక్షిణ చేస్తున్నప్పుడు ఆయన చేతిలో చేతికర్ర ఉండేది. దానితోనే హజ్రుల్ అస్వద్ (కాబా గోడకు మూలన అమర్చిన నల్లనిరాయి)ని ముద్దాడటానికి సూచనగా స్పర్శించేవారు.

ప్రదక్షిణలు పూర్తి చేసిన తరువాత ప్రవక్తశ్రీ(స), ఉస్మాన్ బిన్ తల్హాను పిలిపించి కాబా తాళం చెవులు తీసుకుని తలుపు తెరిచారు. లోనికి వెళ్ళి చూస్తే అక్కడ కర్రతో చెక్కిన పావురాలు కనిపించాయి. వాటిని తన హస్తాలతోనే విరగ్గొట్టి పారేశారు. అక్కడున్న 360 విగ్రహాలను, ఒక్కొక్క దాన్ని తన చేతికర్రతో కొడుతూ, 'సత్యం ఆగమనంతో మిథ్యా సమసిపోయింది, మిథ్య సమసిపోవడం తథ్యం' అని పలికారు. ఇంకా, 'సత్యం ఆగమనంతో మిథ్య వల్ల ఏమీ ఒరగదు' అంటూ విగ్రహాలన్నింటినీ పడగొట్టారు. ఇది దివ్య ఖుర్ఆన్‌లోని బనీ ఇస్రాయీల్ 17: 81 సబా 34: 49 వచనాలు.

ఆపైన ఆయన(స) కాబా గృహంలో నమాజ్ చేశారు. దాని మీదట ఆయన కాబా ద్వారం వద్దకు వచ్చి ప్రసంగించడానికి నిలబడ్డారు. జనులు ఆయన్ని వినడానికి మస్జిద్‌లో గుమిగూడారు. ఆయన ప్రసంగించారు:

"అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు, ఆయన ఒక్కగానొక్కడు, ఆయనకు ఎవ్వరూ సహవర్తులు కారు. ఆయన తన వాగ్దానం నెరవేర్చాడు, తన దాసునికి సహాయమొనర్చాడు. శ్రద్ధగా వినండి, గర్వం, అహంకారాలు, గొప్పలు పోయే విధానాలు, హత్యా ప్రతీకారాల దావా, డబ్బు దస్కం దావాలు నేడు నా ఈ రెండు పాదాల క్రింద తొక్కివేయబడ్డాయి.

"ఖురైష్ సముదాయమా! మీ అజ్ఞాన కాలపు పొగరు, పూర్వీకుల పెద్దరికం అహంభావాలను అల్లాహ్ పారద్రోలాడు. జనులారా! మీరంతా ఆదమ్(అ) ద్వారా పుట్టారు, ఆదమ్ మట్టితో సృజించబడ్డారు. వంశం పొగరు చెల్లదు; అరబ్బులకు అరబ్బేతరులపై, అరబ్బేతరులకు అరబ్బులపై ఎటువంటి పెద్దరికం లేదు. అందరూ సమానులే. మీలో ఎవరయితే అందరికన్నా అధికంగా భయభక్తులు గలవాడో అతనే గౌరవం గలవాడు.

"దైవానికి వందనాలు, ఆయన మీనుండి అజ్ఞాన కాలపు లోపాలను, అప్పటి అహంకారాన్ని పారద్రోలాడు. జనులారా! మానవులంతా రెండు విధాల్లోనే విభజింపబడ్డారు. ఒకటి, సజ్జనులు, నిష్టగలవారు, దైవం దృష్టిలో గౌరవనీయులు. రెండు, పాపాతురుడు, పాషాణ హృదయుడు, దైవం దృష్టిలో నీచుడు. పోతే మానవులంతా ఆదమ్ సంతానమే. ఆదమ్(అ)ని దైవం మన్నుతో సృజించాడు.

అజ్ఞాన కాలపు వడ్డీ ఏదయినా ఎవరి మీద బకాయి ఉన్నా నా ఈ పాదాలకింద నలిపివేయడం జరిగింది.

ప్రప్రథమంగా నేను మా బాబాయి అబ్బాస్(ర)కు రావలసిన వడ్డీని రద్దు పరుస్తున్నాను.''

ఆపైన ఆయన(స) అల్ హుజురాత్ సూరా (49)లోని ఆయత్ 13 పఠించారు :

''మానవులారా! మేము మిమ్మల్ని ఓ స్త్రీ పురుష జంట ద్వారా సృజించాము, ఆపైన మీ జాతుల్నీ కులాలనూ చేశాము. మీలో ఒండొకరి పరిచయం కొరకు. వాస్తవానికి మీలో అందరికన్నా అధికంగా నిష్ఠాపరుడే మీలో అందరికన్నా అధికంగా గౌరవ నీయుడు''.

## మీ పట్ల నేడు ఏ విచారణా లేదు

ప్రసంగం తరువాత ఆయన(స) ఖురైషీలను సంబోధించి, ''నేను మీ పట్ల ఎలా వ్యవహరిస్తానని ఆశిస్తున్నారు?'' అని అడిగారు. దానికి అందరూ సిగ్గిల్లి, ''మీరు ఉదారులయిన సోదరులు, ఉదార సోదరుని తనయులు!'' అని బదులిచ్చారు. దాని మీదట ఆయన ''వెళ్ళండి, మీరంతా స్వేచ్ఛ పొందారు. నేడు మీపైన ఎటువంటి విచారణ లేదు'' అని ఎవ్వరిపైనా ఇస్లామ్ స్వీకరిం చేందుకు ప్రోద్బలం జరపలేదు.

స్వేచ్ఛ పొందారని అన్నది, మక్కావాసులు చాలా మటుకు మహనీయ ముహమ్మద్(స) ప్రవక్తగా ప్రభవించిన రోజు నుంచి నిన్న మొన్నటి వరకు ఇస్లామ్ సందేశాన్ని వ్యతిరేకించి ఆయన మార్గంలో అష్టకష్టాలు సృష్టించినవారే. వారినందరినీ ఆనాడు మన్నించి స్వేచ్ఛనిచ్చారు. తరువాత వారంతా ఇస్లామ్ స్వీకరించారు. వారిలో కొందరిని, వారి ఘోర అపరాధాల కారణంగా మరణ దండనగా సంహరించాలని పేర్లు పెట్టి ప్రకటించారు. కాని అనేక మందిని చివరి క్షణాన విశ్వకారుణ్యమూర్తి క్షమించివేశారు.

జుహర్ నమాజ్ వేళయినప్పుడు దైవసందేశహరులు (స) మహనీయ బిలాల్‌ని ఆదేశించారు, కాబా గృహంపైకి ఎక్కి అజాన్ పిలుపు ఇవ్వమని. మక్కా ఖురైష్ నాయకులు ఈ దృశ్యం చూసి తత్తరపాటుకు లోనయ్యారు. ఇస్లామ్ ధర్మం ఔన్నత్యం, మక్కా విజయం- ఇవి మక్కా నాయకులకు మింగుడు పడని వాస్తవాలు. ప్రవక్త మహనీయులు, సహచరమాన్యులూ మక్కా పుణ్యపురిలో దాదాపు 19 రోజులు గడిపారు.

## ఇస్లామ్ స్వీకారం

మక్కా విజయానంతరం మక్కావాసులు సమూహాలు సమూహాలుగా వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. ప్రవక్త(స) చేతి మీదుగా బయత్, ప్రమాణాలూ చేశారు. ప్రమాణం చేసేవారిలో పురుషులతోపాటు స్త్రీలు కూడా బయత్ చేసినప్పుడు ఆయన(స) కరచాలనం బదులు కేవలం సామూహిక ప్రమాణం చెయ్యడంతో సరిపుచ్చారు. పర స్త్రీలతో కరచాలనం నిషిద్ధమని ఆచరణాత్మకంగా బోధించారు. ప్రమాణం చేయించిన అంశాలు ఆ సందర్భంలో అవతరించిన ఖుర్ఆన్ వచనాలలో ప్రస్తావించబడ్డాయి.

> ప్రవక్తా! నీ వద్దకు విశ్వసించిన మహిళలు బయ్‌త్ (ప్రమాణం) చెయ్యడానికి వచ్చినప్పుడు, వారు ఈ విషయాల పట్ల ప్రమాణం చేయాలి. అల్లాహ్‌తోపాటు మరి దేన్నీ సహవర్తిగా ఎంచరాదు, దొంగతనం చెయ్యరాదు, వ్యభిచరించరాదు, తమ సంతానాన్ని చంపరాదు, కాళ్ళూ చేతులకు సంబంధించిన ఎటువంటి అపనిందను కల్పించరాదు, ఏ ప్రసిద్ధ సదాచార విషయంలోనూ నీకు అవిధేయులు కారాదు. (ఈ విషయాల పట్ల) బయ్‌త్ చేయించు, మరి వారి క్షమాపణ కొరకు అల్లాహ్ సన్నిధిలో ప్రార్థన చెయ్యి. (అల్ ముమ్తహిన 60: 12)

## సందేశ బృందాలు

మక్కాలో బస చేసిన దినాలలో ప్రవక్త మహనీయులు(స) మక్కా పొలిమేరల్లోని ప్రాంతాలకు సందేశ బృందాలు, విగ్రహాలను విరగ్గొట్టడానికి యోధులను పంపారు. మహనీయ ఖాలిద్ బిన్ వలీద్ నాయకత్వంలో ఒక బృందం తాహామా దక్షిణ ప్రాంతానికి పంపారు. అక్కడి తెగవారు ఖాలిద్ బిన్ వలీద్(ర)ని చూడగానే తొలుత కత్తులు దూసారు. పిమ్మట ఆయుధాలు పడవేశారు. అయినప్పటికీ ఖాలిద్(ర) అపోహ కారణంగా కొందరిని సంహరిం చారు. ఈ సమాచారం ప్రవక్త శ్రీకి అందగానే పరిస్థితుల అదుపు కొరకు మహనీయ అలీని అక్కడికి పంపారు. ఆయన హతుల యిన వారి కుటుంబీకులకు హత్యా పరిహారం చెల్లించారు, అంతేకాక తన వద్ద ఉన్న సొమ్మును సయితం ఆ తెగవారిలో పంచిపెట్టారు.

మక్కా పరిసర ప్రాంతమయిన నఖల అనేచోట, పెద్ద విగ్రహం 'ఉజ్జా' ప్రతిష్టించబడి ఉండేది. ఖురైషీలు దాన్ని ఘనంగా పూజించే వారు. మహనీయ కాలిద్ 'నఖల' వెళ్ళి దాన్ని పడగొట్టారు. అలాగే 'సువా' 'మనాత్' అనే విగ్రహాలను సయితం ధ్వంసం చెయ్యడానికి మహనీయ 'సఅద్' బిన్ జైద్‌ని పంపించారు. అలా ఆ రెండు విగ్రహాలూ పడగొట్టడం జరిగింది.

*ఆధారం : 1) సీరతున్నబీ కామిల్, ఇబ్నుహిష్షామ్ : సం.2, పు.479-496*

*2) సీరతె సర్వరె ఆలమ్ : సం.3; పు.335-344*

*3) సీరత్ ఇన్‌సైక్లోపీడియా : సం.9, పు.148-191*

# సంపదను శుద్ధపరిచేదే జకాత్

– ముహమ్మద్ వహీదుద్దీన్

ఇస్లాంలోని సమస్త ఆరాధనల్లో నమాజ్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో జకాత్‌కు కూడా అంతే ప్రాముఖ్యం ఉంది. ఈ రెండింటిలో ఏ ఒక్కదాన్ని నిరాకరించినా ముస్లిం అవిశ్వాసి అవుతాడు. వీటిలో ఒకటి లేకపోతే రెండో దానికి ఏమాత్రం విలువ ఉండదు. ఒక ముస్లిం నమాజ్ చేస్తున్నప్పటికీ ప్రతి సంవత్సరం జకాత్ చెల్లించకపోతే అతని నమాజ్ అతనికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చదు. అలాగే మరొకతను ఏటేటా జకాత్ చెల్లిస్తున్నా జీవితాంతం నమాజ్ చేయకపోతే పరలోకంలో అతని జకాత్ సత్కార్యం బూడిదలో పోసిన పన్నీరులా అవుతుంది.

### ధన ప్రక్షాళనా విధానం

"(సత్యాన్ని) విశ్వసించి సదాచార సంపన్నులయి నమాజ్ (విధి) నిర్వహిస్తూ జకాత్‌ను నెరవేరుస్తూ ఉండేవారికి వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద సిద్ధంగా ఉంది. వారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు". (అల్ బఖర 2: 277)

"విశ్వసించిన స్త్రీ పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు, వారు (ప్రజలకు) మంచి విషయాలు బోధిస్తారు. చెడు విషయాల నుండి వారిస్తారు. నమాజ్(వ్యవస్థ) స్థాపిస్తారు. జకాత్ చెల్లిస్తారు. దేవుని పట్ల, ఆయన ప్రవక్త పట్ల వినయ విధేయతలతో మసలుకుంటారు. వీరిపైన్నే దైవకారుణ్యం వర్షిస్తుంది." (అత్ తౌబా : 71)

జకాత్ అంటే పవిత్రత, పరిశుద్ధత అని అర్థాలున్నాయి. ఇక్కడ ప్రత్యేక పరిభాషలో, ధనికుడు పవిత్రుడయ్యే ఉద్దేశ్యంతో ఏడాదికొకసారి సంపద నుండి రెండున్నర శాతం చొప్పున పేదలకు, ధర్మ సంస్థాపనా కార్యాలకు దానం చేసే ధన కనక వస్తువుల్ని జకాత్ అని అంటారు.

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : "దేవుడు జకాత్ చెల్లింపును ముస్లింలకు విధి (ఫర్జ్)గా చేశాడు. ఇది వారి ధనికుల నుండి వసూలు చేసి, వారి నిరుపేదలకు అందజేయబడుతుంది." (బుఖారీ, ముస్లిం)

పై హదీసును బట్టి జకాత్ పేద ప్రజల హక్కు అని స్పష్టంగా తెలియజేస్తుంది. ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూలస్తంభాలలో విశ్వాస ప్రకటన, నమాజ్ తరువాత 'జకాత్' మూడవ స్తంభంగా పరిగణించబడుతోంది. దివ్య ఖుర్ఆన్‌లో కనీసం 32 చోట్ల నమాజ్‌తోపాటు జకాత్ ప్రస్తావన వచ్చింది. దీన్నిబట్టి కూడా జకాత్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో తెలుస్తుంది. అదీగాక దివ్య ఖుర్ఆన్ అనేకచోట్ల ఈమాన్ తర్వాత నమాజ్, జకాత్‌లను గురించి ప్రస్తావించి ఇవే మొత్తం ధర్మానికి ముఖ్య ప్రాతిపదికలన్న భావాన్ని స్ఫురింపజేస్తుంది.

"వారు నమాజ్‌ను స్థాపిస్తారు, జకాత్ చెల్లిస్తారు, దేవునికి తప్ప మరెవరికీ భయపడరు. అలాంటి వారే సన్మార్గంలో నడుస్తారని ఆశ ఉంటుంది." (అత్ తౌబా :18)

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు: "ఏ సంపద నుండి జకాత్ తీయకుండా అందులోనే కలిసి ఉంటుందో ఆ సంపదను ఇది నాశనం చేస్తుంది." (మిష్కాత్)

### జకాత్ చెల్లించనివారి పర్యవసానం

దైవప్రవక్త(స) ఇలా తెలిపారు : "వెండి బంగారాలు కలిగి ఉన్న వాడు ఎట్టి హక్కు నెరవేర్చకపోతే ప్రళయదినాన ఆ వెండి బంగారాలను అగ్నిలో కాల్చి పలుకులుగా చేసి మండుతున్న ఆ పలకలతో అతని వీపుపై, ప్రక్కలపై, నుదుటిపై వాతలు పెట్టడం జరుగుతుంది. పలకలు చల్లారినప్పుడల్లా వాటిని మళ్ళీ కాల్చి అతని శరీరం మీద వాతలు పెడతారు. ఈ విధంగా యాభై వేల సంవత్సరాల సుదీర్ఘ దినాన యావత్తు మానవాళి తీర్పు ముగిసేదాకా మాటిమాటికి  వాతలు పెట్టడం జరుగుతుంది. చివరికి (తన విశ్వాసం, కర్మలనుబట్టి) స్వర్గానికి లేక నరకానికి పంపబడతాడు. (ముస్లిమ్)

ఎవరికైతే దేవుడు ఐశ్వర్యం ప్రసాదించాడో అతను జకాత్ చెల్లించకపోతే  ప్రళయదినాన ఆ ధనం ఓ పెద్ద కొండచిలువగా మారుతుంది. దాని నెత్తిమీద రెండు చుక్కలుంటాయి. ఆ పామును కంఠపాశంగా చేసి అతని మెడలో వేయడం జరుగుతుంది. అప్పుడా పాము నోటితో అతని దవడలు పట్టుకొని "నేను నీ ధనాన్ని, నీ నిధిని అంటుంది" ఆ తరువాత దైవప్రవక్త (స) ఈ సూక్తి పఠించారు.

"దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం  విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది." (ఆలి ఇమ్రాన్ 3: 180)



- తస్నీమ్‌జహాన్ ఖాన్

# కుటుంబం ప్రతీ మనిషి జన్మహక్కు

**హజ్రత్** ఆదం(అ), హజ్రత్ హవ్వా(అ)ను అల్లాహ్ స్వర్గం నుండి భూమిపైకి పంపిన పిదప వారికి సంతానం కలగజేసి ఒక కుటుంబాన్ని ఏర్పాటు చేశాడు. కుటుంబం ఆధారంగానే మనిషి జీవితం అల్లుకుని ఉంటుంది. భార్యాభర్తల ప్రేమ, తల్లిదండ్రుల వాత్సల్యం, సంతానం అనురాగాలు, తోబుట్టువుల తోడు, పెద్దవాళ్ళను గౌరవించటం, చిన్నవారిని గారాబం చెయ్యటం, సుఖదుఃఖాలలో తోడూ నీడలా ఉండటం, ఒకరికొకరు సహాయ సహకారాలందించటం, కష్టనష్టాలను అందరూ కలిసి భరించటం వంటివన్నీ కుటుంబంలోనే మనం చూడగలుగుతాము. కుటుంబాన్ని ఒక చిన్న సమాజంగా కూడా చెప్పవచ్చు. ఈ చిన్న సమాజం ఎంత పటిష్టంగా, అందంగా ఉంటుందో, పెద్ద సమాజం కూడా పటిష్టంగా ఉండటానికి అంతగా దోహదపడుతుంది.

ఒక కుటుంబం పిల్లాపాపలతో అభివృద్ధి చెంది ఒక వంశంగా మారుతుంది. కుటుంబ వ్యవస్థలో పెరిగిన వ్యక్తి ఆ కుటుంబ ధార్మిక ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలన్నింటినీ సులువుగా ఆకళింపు చేసుకోగలుగుతాడు. ఈ విధంగా ఆ కుటుంబం ఒక పాఠశాలగా మారిపోతుంది. అలాగే కుటుంబంలో పరిపాలనా, నాయకత్వ లక్షణాలను కూడా బాగా ఆకళింపు చేసుకోవచ్చు. కుటుంబాన్ని ధార్మికంగా ఉన్నతంగా తీర్చిదిద్దడం వల్ల ధర్మ సంస్థాపనా కార్యంలో ఎదుర్కోవలసిన సవాళ్ళను సులువుగా అధ్యయనం చెయ్యవచ్చు. కుటుంబాన్ని షరీయత్ ప్రకారం పరిపాలించటం వల్ల ఇస్లామీయ సామ్రాజ్యం ఏ విధంగా పరిపాలించాలో ఒక ఐడియాను ఏర్పరచుకోవచ్చు. దైవప్రవక్త(స) ఒక రాజ్యపాలకుడి బాధ్యతలను గుర్తుచేసిన తర్వాత కుటుంబ సభ్యుల బాధ్యతలను కూడా గుర్తు చేయడం వెనుక ఉన్న మతలబు కూడా ఇదే అయ్యుంటుంది. దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు : "మీలో ప్రతి ఒక్కడూ ఒక సంరక్షకుడు, అతన్ని అతని సంరక్షణలో ఉన్నవారి గురించి ప్రశ్నించడం జరుగుతుంది. ప్రజల సంరక్షకుడు, పాలకుడు అయిన నాయకుణ్ణి అతని ప్రజలను గురించి అడగటం జరుగుతుంది. పురుషుడు తన ఇంటివారి (భార్యాపిల్లల) సంరక్షకుడు. అతన్ని తన ఆశ్రయంలో ఉన్నవారిని గురించి ప్రశ్నించడం జరుగుతుంది. స్త్రీ తన భర్త ఇల్లూ వాకిలికి, అతని వల్ల తనకు కలిగిన సంతానానికి సంరక్షకురాలు. ఆమెను వారిని గురించి విచారించటం జరుగుతుంది." (బుఖారీ, ముస్లిం)

పై హదీసును బట్టి తెలిసేదేమిటంటే పురుషుడి స్థానం సంరక్షకునిది, స్త్రీ స్థానమూ సంరక్షకురాలిదే! వారి ఇల్లు ఒక సామ్రాజ్యం వంటిది. ఉన్నత విలువలు గల కుటుంబాన్ని రూపొందించడం,

దాని గురించి దైవం ముందు జవాబుదారీగా నిలువడం ఇద్దరి సమాన బాధ్యత.

## బలమైన కుటుంబం

ఆధునిక యుగంలో ప్రజలు కుటుంబాన్ని తాత్కాలిక అవసరాలు తీర్చుకునేందుకు ఏర్పరచుకున్న ఒక వ్యవస్థగా భావించటం జరుగుతుంది. పిల్లవాడు బలహీన స్థితి నుండి ఎదిగి నవ యువకుడై ఇక తనకు కుటుంబంతో ఎలాంటి అవసరమూ లేదు కనుక దాన్ని విడిచిపెట్టడమే శ్రేయస్కరం, లేనిపోని బరువు బాధ్యతలు భుజస్కంధాలపై మోయడం అవివేకంగా భావించడం ప్రారంభిస్తున్నాడు. భార్యాభర్తల బంధం కూడా స్వార్థంతో ఏర్పర్చు కోబడుతుంది. పిల్లలూ ఆర్థికంగా బలపడగానే తల్లిదండ్రులను విడిచిపోతున్నారు. ఇస్లాం ఇలాంటి స్వార్థపూరితమైన చర్యలను ద్వేషిస్తుంది. కుటుంబం అనేది ఎల్లప్పుడూ కలసికట్టుగా ఒకరికొకరు ఉండాలని బోధిస్తుంది.

## బంధుత్వాలు పరీక్ష కొరకే!

ఇస్లామీయ దృక్కోణంలో మనిషి జీవితం ఒక పరీక్ష. బంధుత్వాలు బాంధవ్యాలు పరీక్షలో ఒక భాగం. పరీక్షల్లో సులువైన ప్రశ్నలకు మనం సంతోషంగా జవాబులిస్తాం. అదే కఠిన ప్రశ్నలు ఎదురైతే వాటి సమాధానాలకై పూర్తి శక్తిసామర్థ్యాలను ధారపోసే ప్రయత్నం చేస్తాము. బంధుత్వాలను పరీక్షలుగా మానసికంగా మనం భావించడం వల్ల మనిషి ప్రతి బంధుత్వాన్ని పూర్తిగా న్యాయం చెయ్యగలడు. కఠిన స్వభావం గల బంధువులను కూడా మనిషి సమర్థవంతంగా సంతోషపెట్టగలుగుతాడు. బంధుత్వాన్ని నిర్వర్తించడంలో ఎంత కష్టాన్ని, బాధను ఓర్చుకోవలసి వచ్చినా ఓర్చుకోగలుగుతాడు. కఠిన ప్రశ్నకు సమాధానమిచ్చిన తర్వాత మనసు ఎంత హాయిగా ఉంటుందో, కఠిన బంధువులను ఎదుర్కొన్న తర్వాత అంతే హాయిగా ఉంటుంది. ఈవిధంగా బంధుత్వాలను పరీక్షగా భావించటం వల్ల వాటిని డీల్ చెయ్యటం చాలా సులువైపోతుంది. సమస్యలు, కష్టాలు ఎదురైనప్పుడు మనిషి బంధుత్వాల నుండి పారిపోకుండా ఎదురొడ్డి పోరాడగలిగే సామర్థ్యం ఏర్పడుతుంది.

## బంధుత్వాలు అల్లాహ్ కలిపినవే!

బంధాలు అల్లాహ్ ఏర్పర్చాడు. అందువల్లనే వాటికి ప్రత్యేకమైన స్థానం ఉన్నది. బంధుత్వాలను త్రెంచుకోవటం అల్లాహ్ ఏర్పరచిన హద్దులను త్రెంచటం వంటిది. అందువల్లనే అల్లాహ్ అయిష్టతను మూటకట్టుకోవాలేమోననే భయమే బంధుత్వాలకు రక్షణగా నిలుస్తుంది. అల్లాహ్ మనిషిని భూమిపై తన ప్రతినిధిగా చేసి పంపాడని మనందరికీ తెలుసు. భూమిపై ప్రాతినిధ్యం వహించేందుకు కావలసిన మొదటి అంశం కుటుంబం, బాంధవ్యాలు! ఈ బాంధవ్యాలను సక్రమంగా, న్యాయంగా నిర్వర్తిస్తూనే మనిషి ప్రతినిధి బాధ్యతలను నిర్వర్తించగలుగుతాడు. బంధువుల మధ్య సహజంగానే ప్రేమానురాగాలు ఉంటాయి. అయినా కూడా అల్లాహ్ ప్రత్యేకంగా బంధుత్వాలను త్రెంచుకోవద్దని తాకీదు చెయ్యడానికి కారణం, వాటిని ఎట్టి పరిస్థితిలోనూ త్రెంచవద్దనే. కడవరకూ వాటిని మనం నిర్వర్తిస్తూనే ఉండాలి. మనిషి జీవితంలో భార్యాభర్తల బంధం తప్ప మరే ఇతర బంధానికి తెగతెంపులు చేసుకునే వీలు, అనుమతి లేనేలేదు. పుట్టుక నుండి వచ్చిన బంధుత్వాలు గిట్టేవరకు ఉండాల్సిందే! భార్యాభర్తలు వేరు పడటం కూడా అల్లాహ్‌కు అత్యంత అయిష్టకరమైన కార్యం. సహనం, సర్దుకుపోయే గుణం వల్ల బంధాలను బంధుత్వాలను ఒడిసిపట్టుకోవటం చాలా అవసరం.

## ప్రేమతో బంధాలను గెలవండి

మీ ప్రేమకు ఎక్కువ హక్కుదారులు అల్లాహ్, దైవప్రవక్త(స) తర్వాత మీ బంధువులే. కొందరు ప్రపంచమంతటా ప్రేమను పంచుతారు. శాంతికపోతాలుగా ఉంటారు. కాని ఇంట్లో కుటుంబ సభ్యులను పట్టించుకోరు. ప్రేమతో వారిని పలకరించాలనే బుద్ధిజ్ఞానము ఉండదు. తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, పెద్దలు, పిన్నలు అందరినీ ప్రేమించాలి. చిన్నచిన్న గొడవలకే బంధాలను త్రెంచుకోవటం, బంధువులను ద్వేషించటం అల్లాహ్‌కు నచ్చని విషయాలు. ఒకేచోట నలుగురున్న చోట భిన్నాభిప్రాయాలు, భిన్న ప్రవర్తనలు కనిపించడం సహజమే, కాని అలా అని బంధువులను అగౌరవపరచటం చేయరాదు.

మీ ప్రవర్తన వల్ల ఇతరులు బాధపడకుండా ఉండేలా చూసుకోవాలి. మీరు ఒక ఆదర్శ కుటుంబ సభ్యుని వలే కుటుంబంలో కొనసాగాలి. అలిగిన వారిని బుజ్జగించాలి. ఎవరైనా అపార్థానికి గురైతే అపార్థ మబ్బుల్ని తొలగించేయాలి. ఎవరైనా దూరంగా ఉంటుంటే, వారిని దగ్గరగా చేర్చుకునే ప్రయత్నం చెయ్యాలి. ప్రేమ ద్వారా, బహుమానాల ద్వారా, డబ్బు ద్వారా ఎలా సాధ్యపడితే అలా బంధుత్వాలను కలుపుకుని ముందుండి సాగాలి.

## కుటుంబం మనిషి జన్మహక్కు

ఆధునిక పోకడల వల్లనో లేక మనుషుల్లో స్వార్థం ఎక్కువ అయిపోవడం వల్లనో కుటుంబ వ్యవస్థను పూర్తిగా కాలరాస్తున్నారు.

మిగతా 30వ పేజీలో...




# నదుల అనుసంధానం

**దేశంలో** నదులను అనుసంధానించి వరదల, కరువు కాటకాల సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు ఆ ఆలోచన అమలుకు బడ్జెట్ కేటాయింపులు కూడా జరిగాయి. దేశంలో నదుల అనుసంధానం ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియలో భాగంగా గుర్తించిన మొత్తం 30 లింకులలో 8 లింకు ప్రాజెక్ట్‌లకు సంబంధించి సవివర ప్రాజెక్ట్ నివేదికలు పూర్తయ్యాయని జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్సీపీ సభ్యులు విజయ సాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిచ్చారు. మరో 24 లింకు ప్రాజెక్ట్‌లకు సంబంధించి ఫీజిబిలిటీ నివేదికలు కూడా పూర్తయినట్లు చెప్పారు. నదుల అనుసంధాన ప్రాజెక్ట్ అమలు కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించాల్సి ఉంటుందని ఈ నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని మంత్రి చెప్పారు.

బడ్జెట్‌లో కూడా నదుల అనుసంధానానికి కేటాయింపులు ఇచ్చారు. నదుల అనుసంధానం కోసం బడ్జెట్‌లో రూ.44,605 కోట్లు కేటాయించినట్టుగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ పథకం కింద డీపీఆర్‌లు కూడా సిద్ధం చేశామన్నారు. నదుల అనుసంధానం గురించి చాలా కాలంగా ప్రభుత్వాలు చెబుతున్నాయి. అయితే ఈ దఫా బడ్జెట్ ప్రసంగంలో కీలకమైన నదుల అనుసంధానం కోసం డీపీఆర్‌లు కూడా ఖరారయ్యాయని కూడా కేంద్ర మంత్రి ప్రకటించడం విశేషం. గోదావరి, కావేరి నదుల అనుసంధానం కూడా మళ్లీ తెరపైకి వచ్చింది. గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు చేపడ్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో వెల్లడించారు. నదుల అనుసంధానంపై రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించారు. ఇచ్చంపల్లి వద్ద నదిలో 324 టీఎంసీల మిగులు జలాలు ఉన్నట్టుగా పేర్కొన్నారు. దీనిపై తెలంగాణ అభ్యంతరం చెప్తోంది. గోదావరి- కావేరి లింక్‌లో భాగంగా తరలించే 247 టీఎంసీల్లో 70 టీఎంసీలు ఛత్తీస్‌గఢ్ వాటా ఉందని గుర్తు చేస్తోంది. ఇంద్రావతిపై తాము ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, అలాంటప్పుడు మిగులు జలాలే ఉండవని ఛత్తీస్‌గఢ్ వాదిస్తోంది. ఈ లింక్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో 58 వేల హెక్టార్లకు, ఏపీలో 2.07 లక్షలు, తమిళనాడులో 1.65 లక్షల హెక్టార్లకు నీళ్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. రాష్ట్రానికి ఎక్కువ ప్రయోజనం చేకూర్చేలా ప్రాజెక్టు చేపట్టడంతో పాటు, ముందుగా మహానది నుంచి గోదావరికి లింక్ చేయాలని తెలంగాణ కోరుతోంది. నదుల అనుసంధానంపై బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చేసిన ప్రతిపాదనలపై సీఎం కేసీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ఏ ప్రాతిపదికన అనుసంధానం

చేస్తారని ప్రశ్నించారు. జోక్ ఆఫ్ ది మిలీనియం అని విమర్శించారు. గోదావరి మీద ట్రిబ్యునల్ తీర్పు ఉన్నది. ఆ తీర్పు ప్రకారం ఒక్కసారి తెలుగు రాష్ట్రాల్లోకి ఎంటర్ అయిన గోదావరిలో ప్రతి నీటి చుక్కపైన అధికారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఉంటదని ట్రిబ్యునల్ చెప్పింది. వాటర్ ట్రిబ్యునల్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానం. మా నీళ్లను.. మమ్మల్ని అడగకుండా.. సుప్రీం తీర్పుతో సమానమైన తీర్పును పక్కకుపెట్టి కావేరినదిలో ఎలా కలుపుతారని ఆయన ప్రశ్నించారు. గోదావరిలో మిగులు జలాలే ఉంటే తెలంగాణ ప్రతిపాదనలు దగ్గర పెట్టుకొని అనుమతులు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు.

ఇండియాలో నాలుగు కోట్ల హెక్టార్ల ప్రాంతానికి వరదముప్పు, 68 శాతం భూభాగానికి కరవు కాటకాల విపత్తు దాపురించే అవకాశం ఉందని జాతీయ అధ్యయన గణాంకాలు దశాబ్దాలుగా ఎలుగెత్తి చాటుతున్నాయి. ప్రపంచ భూభాగంలో దాదాపు రెండున్నర శాతం, జలవనరుల్లో నాలుగు శాతం గల ఇండియా ప్రపంచంలోని 18 శాతం జనాభా ఉంటున్న దేశం. కానీ నదీ జలాల్లో మూడోవంతునైనా వినియోగించుకోలేక పోతోందన్నది వాస్తవం. నదుల అనుసంధానం అనేది భారీ ప్రాజెక్ట్. దీని ఉద్దేశం భారత ఉపఖండంలోని నదులను అనుసంధానం చేయడం. ఉత్తర, ఈశాన్య దక్షిణ భారతాల్లోని నదులను కలపడం. ఈ అనుసంధానంలో భాగంగా భారీ రిజర్వాయర్లు, మెగా డ్యాములు నిర్మిస్తారు. అతిపెద్ద కాలువలు తవ్వుతారు. ఈ మహాయజ్ఞం ప్రధాన ఉద్దేశం ఉత్తర భారతం, ఈశాన్య భారతాల్లో వరదల తీవ్రతను తగ్గించడం. ఆ వరద నీటిని మధ్య, పశ్చిమ, దక్షిణ భారతాల్లో తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటోన్న దుర్భిక్ష ప్రాంతాలకు మళ్లించడం.

గత ఎనిమిది సంవత్సరాలుగా నదుల అనుసంధానం గురించిన వార్తలు వస్తూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా నదుల అనుసంధానంపై చాలా చర్చ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం అప్పట్లో గోదావరి జలాలను కృష్ణా నదిలో కలిపేందుకు ఉద్దేశించిన పట్టి సీమ ప్రాజెక్టును ఆఘమేఘాల మీద పూర్తి చేసి గోదావరి నీళ్ళను కృష్ణలో కలిపామని సగర్వంగా ప్రకటించింది. కాని ఈ విషయంలో ఎవరి అభిప్రాయాలు వారికి వున్నాయి. ఎవరి అనుమానాలు వారికి వున్నాయి. ఉండడమే కాదు వాటిని బాహాటంగా వ్యక్తం చేశారు, విమర్శించారు కూడా. ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా పట్టిసీమపై అప్పట్లో తీవ్రమైన విమర్శలు చేశారు. పట్టిసీమలో రూ.391 కోట్లు రాష్ట్ర ఖజానాకు నష్టమని కాగ్ తేల్చిందన్నారు. పట్టిసీమ నదుల అనుసంధానం కాదని నేషనల్ వాటర్ డవలప్‌మెంట్ అథారిటీ తేల్చి చెప్పిందని విమర్శించారు.

నితిన్ గడ్కరి కేంద్ర జలవనరుల శాఖా మంత్రిగా 2018లో కూడా నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. రెండు లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో మరో ఐదు నదుల అనుసంధాన బృహత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని అన్నారు. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి ఆర్థిక సాయం కోసం ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. భూటాన్ దేశంతో ముడిపడివుండటం వల్ల మానస- సంకోష్- తీస్తా- గంగానదుల అనుసంధానం ప్రాజెక్టు, చునార్-సోనే బ్యారేజి, సోనే డ్యామ్-గంగానది దక్షిణ ప్రాంతాల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణం అలస్యం అవుతోందని అప్పట్లో కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చెప్పారు. అలాగే కోసీ-మేచీ, కోసీ-ఘగరా నదుల అనుసంధాన ప్రాజెక్టు పథకం నేపాల్‌తో ముడిపడివుందన్నారు.

నదుల అనుసంధానం వల్ల చాలా ప్రయోజనాలున్నాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అభ్యంతరాలు, విమర్శలు కూడా చాలా ఉన్నాయి. నదుల అనుసంధానం దేశానికి మంచిది కాదని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మెగసెసె పురస్కార గ్రహీత రాజేంద్రసింగ్ హెచ్చరించారు. రాష్ట్రాలకు నీళ్లపై, నదులపై ఉన్న హక్కులను లాక్కొని బడా వర్గాలకు కట్టబెట్టడానికే నదుల అనుసంధానం వెనుక ఉన్న ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. నదుల అనుసంధానం పేరిట పనులు చేపడితే ఇదివరకే ఉన్న నదులన్నీ దెబ్బతింటాయనీ, నదులపై, నీళ్లపై రాష్ట్రాలకు ఉన్న హక్కులన్నీ కాలరాయడమే ఆ పథకం లక్ష్యమనీ, నదులపై హక్కులను బడాబాబులకు అప్పగించాలనే కుట్ర నదుల అనుసంధానంలో ఉందని ఆయన విమర్శించారు.

నదుల అనుసంధాన ప్రయత్నాల్లో అనేక అడ్డంకులు సమస్యలు చాలా సార్లు వచ్చాయి. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని మోడీ స్వంత రాష్ట్రం గుజరాత్‌లో గిరిజనులు, ఆదివాసీలు అక్కడి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన బాటపట్టారు. నర్మదా వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్ట్ డీపీఆర్‌ను రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం, నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా అనేక చోట్ల రిజర్వాయర్లు నిర్మిస్తారు. దాంతో గిరిజన, ఆదివాసీలకు చెందిన 6065 హెక్టార్ల వ్యవసాయ భూమి నీట మునుగుతుంది. మొత్తం 61 గ్రామాలు

ప్రభావితం అవుతాయి. నిర్వాసితులకు నష్టపరిహారం అందజేస్తామని, పునరావాసం కల్పిస్తామని ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్రం చెప్పినా వారంతా ఆందోళనబాట పట్టారు. చివరకు ఆ పనులు ఆపవలసి వచ్చింది. ఇలాంటి అడ్డంకులు, సమస్యలు, అభ్యంతరాలు వస్తున్నప్పటికీ ప్రభుత్వం నదుల అనుసంధానం విషయంలో ముందుకే వెళుతోంది. దేశంలో వున్న వేలాది నదుల్లో కొన్ని మాత్రమే జీవనదులు. చాలావరకు వర్షాధారంగా పారే నదులు. అందువల్ల వీటిని అనుసంధానం చేయడం ద్వారా ఎక్కువ ఫలితాలను సాధించవచ్చనీ, వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని పంటపొలాలకు మళ్ళించవచ్చనీ అనుసంధాన ప్రక్రియ మద్దతుదార్లు అంటున్నారు. ఇదేమీ కొత్తగా పుట్టుకొచ్చిన ఆలోచన అయితే కాదు. ఎన్నో దశాబ్దాల క్రితమే కాటన్ దొర వంటి వారు దీన్ని చేసి చూపించారు. గంగా కావేరీ అనుసంధానం చేయాలని ఎన్నో ఏళ్ళ నాడే ప్రముఖ ఇంజినీరు కేఎల్ రావు తలపోసి ప్రణాళికలు కూడా సిద్ధం చేసారు. పూర్తి స్థాయిలో నదుల అనుసంధానం జరగడానికి పదకొండు లక్షల కోట్లు అవసరమవుతాయని అంచనా. నీరు సమృద్ధిగా పారే 37 హిమాలయ నదులను నీటి లభ్యత తక్కువగా వుండే దేశంలోని ఇతర నదులతో కలిపి వాటిని జీవనదులుగా మార్చడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందులో భాగంగా నదులను కలుపుతూ, యాభయ్ నుంచి వంద అడుగుల వెడల్పున్న 30 కాలువలను పదిహేను వేల కిలోమీటర్ల పొడవున తవ్వుతారు. చిన్నా పెద్దా అన్నీ కలిపి మూడువేల రిజర్వాయర్లు నిర్మిస్తారు. తద్వారా ఎనిమిది కోట్ల డెబ్బయి లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తారు. దీనికి తోడు, మొత్తం 34 గిగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తికి మార్గం వేస్తారు. నిజంగా కళ్ళు చెదిరే ప్రాజక్టే. సరిగ్గా అమలు చేయకపోతే అంతకంటే నిజంగా అంతంత ప్రజాధనం నీళ్ళ పాలు చేసే ప్రాజక్టు. మరో వైపు పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రకృతి ప్రేమికులు దీన్ని పీడకలగా అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పరిణామాలు భయంకరంగా ఉంటాయని, పూర్తి బాధ్యతా రాహిత్యంతో కూడిన ఆలోచన అనీ కొట్టిపారేస్తున్నారు.

ఏ నదికి ఆ నది కొన్ని ప్రత్యేకతలు కలిగి వుంటుంది. పొడవైన కాలువలు తవ్వి వాటిని కలిపే ప్రయత్నంలో నదుల నడుమ వున్న రక్షిత అటవీ ప్రాంతాలు విధ్వంసానికి గురవుతాయి. ప్రకృతికి కొన్ని సహజ లక్షణాలు వుంటాయి. వాటిని విధ్వంసం చేయాలని చూస్తే విలయకారకమవుతాయి అనేది వారి అభిప్రాయం. జలవనరులను కాపాడుకోవడానికి నదుల అనుసంధానం ఒక్కటే మార్గం కాదు. వాటర్ షెడ్స్, వర్షాల వల్ల సమకూరే నీటిని భవిష్యత్ అవసరాలకు భద్రపరచుకోవడం, భూగర్భ జలవనరులను పెంచుకోవడం, ఇంకుడు గుంతలు, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు పండించే పద్దతుల్లో మార్పులు చేసుకోవడం ఇలా అనేక ప్రత్యామ్నాయాలు వుంటాయి. వాటినన్నింటినీ పూర్తిగా వాడుకున్న తరువాతనే నదుల అనుసంధానం వంటి భారీ ప్రాజెక్టులను గురించి తలపెట్టాలన్నది వారి వాదన.

కొన్ని నదులు చిన్న చిన్న సముద్రాల్లో కలుస్తాయి. ఉదాహరణకు కాస్పియన్ సముద్రం, అరల్ సముద్రం. నిజానికి ఇవి సహజసిద్ధంగా ఏర్పడిన సరస్సులు. అయితే వాటి భారీ పరిమాణం కారణంగా సముద్రాలని పిలుస్తున్నారు. ప్రకృతి చూడ్డానికి చాలా సరళంగా కనిపిస్తుంది. కానీ తరచి చూస్తే చాలా సంక్లిష్టంగా ఉంటుంది. ప్రతి నదికి ఒక ప్రత్యేకమైన పర్యావరణ వ్యవస్థ ఉంటుంది. నది పుట్టిన దగ్గర నుంచి సముద్రంలో కలిసే దాకా ఈ వ్యవస్థలో వందల కొద్దీ జీవజాతులు ఉంటాయి. నదుల అనుసంధానాన్ని కేవలం కాలువలు కలపడం అనే కోణం నుంచి మాత్రమే చూడకూడదు. నదులు.. భారీ జీవ వ్యవస్థలకు ఆలంబనగా ఉంటాయి. మనిషి చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల ఈ వ్యవస్థలకు తీరని నష్టం వాటిల్లుతుంది. అలాంటి నష్టం మనకు అరల్ సముద్రం వద్ద కనిపిస్తుంది. 1950లు, 60లలో సోవియట్ యూనియన్ అరల్ సముద్రంలోకి ప్రవహించే నదులను దారి మళ్లించింది. దుర్భిక్ష ప్రాంతాల్లో నీటి పారుదల కోసం, వ్యవసాయాభివృద్ధి కోసం ఈ నీటిని తీసుకెళ్లింది. ఫలితంగా అరల్ సముద్రం ఎండిపోవడం మొదలుపెట్టింది. అరల్ సముద్రం భూమ్మీద నాలుగో అతిపెద్ద సరస్సు. 1990లు వచ్చే నాటికి అరల్ సముద్రం తన ఒరిజినల్ సైజులో కేవలం పదో వంతుకు తగ్గిపోయింది. ఒక మృత సముద్రంలా మారిపోయింది. చేపల జాడ లేకుండా పోయింది. దీనివల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. మరోవైపు అరల్ సముద్రంలోకి వచ్చే నీటిని కరువు ప్రాంతాల్లోకి మళ్లించడం వల్ల దుష్ఫలితాలు వచ్చాయి. ఈ నీటితో పండిస్తోన్న పత్తి వల్ల ఆశించిన ప్రయోజనాలు రాలేదు. తొలుత కొన్ని సంవత్సరాల పాటు నీటి మళ్లింపు మేలు చేసింది. లాభాల పంట పండించింది. నీటిని అందుకున్న కరువు ప్రాంతం అతిపెద్ద పత్తి ఎగుమతి దారుగా మారింది. అయితే ఇది తాత్కాలిక ఆనందమే అయింది. సంవత్సరాలు గడుస్తూ వచ్చే కొద్దీ దారి మళ్లించిన నీటిలో 30 నుంచి 75 శాతం వృథాగా పోవడం మొదలైంది. కాలువలకు లీకేజీలు ఏర్పడటం, నీరు ఆవిరి కావడం వల్ల దీర్ఘకాలంలో ఈ భారీ ప్రాజెక్టు ఒక విపత్తుగా మారింది. ఆ తరువాత UNESCO, అరల్ సముద్రం నీటి

మళ్లింపును ఒక "ఎన్విరాన్‌మెంటల్ ట్రాజెడీగా ప్రకటించింది. ఇప్పుడు అరాల్ సముద్ర ప్రాంతాన్ని "అరల్‌కులం ఎడారి" అని పిలుస్తున్నారు.

నదుల అనుసంధానం వల్ల లక్షల మంది పేద ప్రజలు గూడు కోల్పోతారు. లక్షల హెక్టార్ల భూమి నీటిలో శాశ్వతంగా మునిగి పోతుంది. ప్రకృతి మన సంపద. మన జీవితం. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పినట్లు, "ఈ భూమ్మీద నుంచి తేనెటీగలు అంతరించి పోతే ఆ తరువాత నాలుగు సంవత్సరాలకే మనిషి మనుగడ ముగిసి పోతుంది". ఇది ప్రకృతి, ప్రకృతిని ధ్వంసం చేస్తే మనుగడ ఉండదు. అభివృద్ధి పేరుతో ప్రకృతి నాశనం చేయడం అంటే ఆత్మహత్య చేసుకోవడంతో సమానం.

కాని ప్రభుత్వ వాదన వేరుగా ఉంది. నదుల అనుసంధాన మహా యజ్ఞాన్ని నిష్ఠగా పూర్తి చెయ్యగలిగితే- వరదల ముప్పును తప్పించడంతోపాటు క్షామ పీడిత పరగణాల్లో పంట సిరులకు భరోసా ఇవ్వవచ్చంటున్నారు. తొలుత ఉత్తర్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్‌ల గుండా ప్రవహించే కెన్, బెట్వా నదుల అనుసంధానంతో శ్రీకారం చుట్టడానికి పూర్వ రంగాన్ని వడివడిగా సిద్ధం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం- భాజపా పాలిత రాష్ట్రాల మధ్య సదవగాహనతో వాటిని పూర్తి చెయ్యడం ద్వారా తక్కిన రాష్ట్రాల్లో సుహృద్భావానికి ప్రోది చెయ్యాలనుకొంటోంది. గంగ-కావేరీ నదుల్ని కలిపితే పట్నా దగ్గర 150 రోజులపాటు 60వేల క్యూసెక్కుల దాకా వరద నీటిని బిగబట్టి, 40 లక్షల హెక్టార్ల సాగునేలను సస్యశ్యామలం చెయ్యగల వీలుందని 1972లోనే తెలుగు బిడ్డ కేఎల్ రావు ప్రతిపాదించారు. పిమ్మట అయిదేళ్లకు వెలుగు చూసిన దస్తూర్ పథకం పూలహారంలా జల వనరుల అనుసంధానానికి లక్షా 20 వేలకోట్ల రూపాయల వ్యయం కాగలదని అంచనా వేసింది. దేశంలో సంభవిస్తున్న వరదలను అడ్డుకట్ట వేసేందుకు నదుల అనుసంధానం తప్పనిసరని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అభిప్రాయపడ్డారు. కానీ నదుల అనుసంధానాన్ని వ్యతిరేకించే వారి వాదనలు వేరేగా ఉన్నాయి. ఏ నదీ పరీవాహక రాష్ట్రం కూడా తమ ప్రాంతంలో ప్రవహించే నదీజలాలను మరో రాష్ట్రానికి తరలించడానికి ఒప్పుకోదు. భవిష్యత్తులో ఏ రాష్ట్రానికైనా నీటి అవసరాలు పెరుగుతాయి. ప్రస్తుతం మిగులు జలాలున్నాయని తరలిస్తే అది తాత్కాలిక చర్య అవుతుందే తప్ప శాశ్వతంగా ఈ ఏర్పాటు మనజాలదు. నదీ పరీవాహక ప్రాంతాల్లో అడవులను పెంచడం, నదులను, వాగుల పరిరక్షణకు ప్రణాళికలను తయారు చేసి కట్టుదిట్టంగా అమలుచేయడం, ప్రతి వర్షపు చినుకును ఒడిసి పట్టుకొని నిల్వ చెయ్యడం, పరిగెత్తే నీటిని నెమ్మదిగా వెళ్ళేలా నదుల్లో, వాగుల్లో ఇసుకను కాపాడటం, భూగర్భ జలాలు పెంచడానికి అన్ని రకాల చర్యలను చేపట్టడం, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ సాగు నీరు అవసరమైన చెరుకు, వరి, గోధుమ పంటలను నిషేధించడం ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, అవసరమైతే క్రాప్ హాలిడే ప్రకటించడం, తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించే విధంగా నీటి వినియోగాన్ని నియంత్రించడం వంటి విధానాలు అనుసరించడం మంచిదని అంటున్నారు.

నది నుండి నదికి నీటిని రవాణా చేయడానికి వేల కిలోమీటర్ల కాలువలను నిర్మించినప్పుడు, సగటున 35 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న ఈ దేశంలో, నీటిలో అధిక భాగం ఆవిరైపోతుంది. పైగా భూమి బాగా పీల్చేసుకుంటుంది. ఆ కాలువలను ఏ విధంగా నిర్మించినా ఎక్కడో ఒకచోట లీకేజీ ఏర్పడి దాహార్తితో ఉన్న భూమి ఆ నీటిని తాగేస్తుందని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ నదుల అనుసంధానం అనే ఆలోచన, "సముద్రంలోకి ప్రవహించే నీరు వ్యర్థం" అనే భావన లోనుంచి పుట్టుకొస్తుంది. ఈ భావన పోవాలి. ఇది చాలా ప్రమాదకరమైనది, ఎందుకంటే ఆ నీరు సముద్రంలోకి ప్రవహించకుండా చేస్తే, మొత్తం నీటి చక్రానికి భంగం కలిగించినట్టే. వర్షాకాలంలో వానల పరిమాణం ఏ మాత్రం ఉంటుంది అనేది, సముద్రంలోకి ఎంత నదీ జలాలు ప్రవహిస్తున్నాయి అన్న దానిపై నేరుగా ఆధారపడి ఉంటుంది. నదులను సముద్రంలోకి చేరకుండా ఆపడం వల్ల తీరప్రాంతాల వెంబడి ఉన్న భూమిపై కూడా ప్రభావం పడుతుంది. నది నీరు సముద్రంలోకి ప్రవహించకపోతే, భూగర్భ జలాల్లోకి ఉప్పదనం చొచ్చుకుపోవడం జరుగుతుంది. ఉదాహరణకు, గుజరాత్‌లో లవణీయత కారణంగా సంవత్సరానికి దాదాపు 550 చదరపు కిలోమీటర్ల భూమిని కోల్పోతున్నారు. భారతదేశానికి దాదాపు 7400 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. నదీ జలాలు సముద్రంలోకి ప్రవహించకపోతే, సముద్రపు నీరు 100 నుండి 130 కిలోమీటర్ల దూరం వరకు భూగర్భ

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

జలాలను కలుషితం చేస్తుంది. ఎక్కడ బోర్‌వెల్ వేసినా సముద్ర జలాలే ఉన్నందువల్ల గ్రామాలను పూర్తిగా ఖాళీ చేయించడం అనేది గుజరాత్, తమిళనాడులలో ఇప్పటికే జరిగింది. వరద నివారణ చర్యల కోసం అవసరమైన చోట్ల ఈ నదుల అనుసంధానం చేపడితే అప్పుడు దాని వల్ల మేలు జరుగుతుంది. అంతేగానీ మొరటుగా దేశవ్యాప్తంగా నదులను అనుసంధానించడం మంచిది కాదని చాలా మంది వాదిస్తున్నారు.

దక్షిణ భారతదేశంలో కావేరీ జలాల కోసం తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా ఘర్షణ నెలకొంది. రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా జలాల పంపకంపై ఆంధ్ర, తెలంగాణ మధ్య సయోధ్య లేదు. ఎగువ రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రలోని ప్రాజెక్టులు నిండి వారికి ఎక్కువైన నీటిని దిగువకు వదిలితే ముందుగా శ్రీశైలం నిండాలి. ఆ తర్వాత అదే సమయంలో భారీ వర్షాలు కురిస్తే ఎగువ నుంచి వచ్చే వరద నీరు, స్థానిక వరద నీటితో శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నిండుతాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 35 లక్షల ఎకరాల భూములు, దాదాపు 30 మున్సిపాలిటీలు, వేల గ్రామాలు కృష్ణా నీటిపై ఆధారపడి ఉన్నాయి. మన దేశంలో సాలీనా కురిసే వర్షపాతం జలాల పరిమాణం దాదాపు 1,37,000 టిఎంసి. ఇందులో 66వేల టిఎంసి నీరు సముద్రంలో కలుస్తోంది. హిమాలయాల్లో పుట్టి బంగాళాఖాతంలో కలిసే గంగానది జలాల్లో 4వేల టిఎంసి తక్కువగా ఉపయోగించుకుంటున్నారు. దాదాపు 10వేల టిఎంసికిపైగా గంగాజలాలు సముద్రంలో కలుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోనే నదుల అనుసంధాన ప్రక్రియకు సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా నదుల అనుసంధానం వల్ల తలెత్తే పర్యావరణ సమస్యలు, ఇతర సమస్యలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. అలాగే వివిధ రాష్ట్రాల సమస్యలను అవగతం చేసుకోవాలి. భారతదేశం పొరుగున ఉన్న నేపాల్, భూటాన్, ఇటు బంగ్లాదేశ్, తదితర దేశాల అభ్యంతరాల వల్ల తలెత్తే సమస్యలను పరిష్కరించాలి. వీటన్నింటికి మించి నదుల అనుసంధానం వంటి ప్రయత్నాలు జరిగిన దేశాల్లో ఎలాంటి ఫలితాలు వచ్చాయో అధ్యయనం చేయాలి. ఒక పకడ్బందీ ప్రణాళికతో నీటి సమస్యలు తీర్చడానికి నడుం కట్టాలి.

25వ పేజీ తరువాయి...

కుటుంబం ఒక చిన్న సమాజం వంటిది. కుటుంబంలోని బాంధవ్యాల కలయిక, వారితో అనుబంధం మనిషికి సమాజంలో ఎలా జీవించాలో తెలియజేస్తుంది. "చిన్న కుటుంబం చింత లేని కుటుంబం" అనే భావన సరైనది కాదని చైనా వాళ్ళు చాలా ఆలస్యంగా అర్థం చేసుకున్నారు. కేవలం ఒక బిడ్డకు మాత్రమే జన్మనిచ్చే అవకాశాన్ని చైనా ప్రభుత్వం ఇచ్చింది. ఫలితంగా తోబుట్టువు అనే ఒక కీలక బంధాన్ని అక్కడి పిల్లలు కోల్పోవడం, దానివల్ల వారి జీవితాలు నెగిటివ్‌గా ప్రభావితమవటం గుర్తించారు. జీవితంలో తోబుట్టువుల కొరత చాలా దారుణంగా ఉంటుంది. తల్లిదండ్రులకంటే కూడా చిన్న పిల్లలకు తోబుట్టువులే తోడుగా ఉన్నట్టు వారు భావిస్తారు. ఎన్నో విషయాలు అక్కలను, అన్నయ్యలను చూసి సులువుగా నేర్చుకుంటారు. అలాగే తమ్ముళ్ళను, చెల్లెళ్ళను చూసి పెద్ద పిల్లలూ చాలా విషయాలు నేర్చుకుంటారు. తల్లిదండ్రులతో చెప్పుకోలేని సంతోషాలు, బాధలు అన్నీ తోబుట్టువులతో పంచుకుంటారు. ఒక కుటుంబంలో కేవలం ఒకే బిడ్డ ఉంటే మళ్ళీ ఆ బిడ్డకూ ఒకే బిడ్డ ఉంటే, తల్లిదండ్రులు తప్ప మావయ్యలు, పిన్నమ్మలు, పెద్దమ్మలు, బాబాయిలు, పెద్ద నాన్నలు, కజిన్స్, అక్కాచెల్లెళ్ళు, అన్నాదమ్ముళ్ళు ఎవరుంటారు వారికి? ఒకవేళ ప్రమాదవశాత్తు తల్లిదండ్రులు పరమపదిస్తే వారికి తోడూ నీడగా ఎవరు నిలుస్తారు? అక్కున చేర్చుకునేందుకు కుటుంబమే ఉండదు. ఒంటరి జీవితం తప్ప ఇంకేమి మిగుల్తుంది?

నగరాల్లో అయినా, పల్లెటూర్లలో అయినా పెద్ద కుటుంబం ఉన్న వారి జోలికి రావాలంటే ఇతరులు భయపడతారు. అదే దిక్కు మొక్కు లేనివారికి ఎవరూ భయపడరు. అందుకే మనిషికి కుటుంబ అండదండలు చాలా అవసరం. ఇహలోకంలోనూ ఇది మనల్ని కీడుల నుండి రక్షిస్తుంది, పరలోకంలోనూ అల్లాహ్ సామీప్యత పొందటానికి ఉపయోగపడుతుంది. కుటుంబాన్ని తేలికగా భావించకండి. కుటుంబం లేనిదే మీరు లేరు. మీరు లేనిదే కుటుంబం లేదు.

వింత వింత పోకడలు మన సమాజంలో కన్పిస్తున్నాయి. సింగిల్ మదర్స్, సింగిల్ ఫాదర్స్. మూన్నాళ్ళ ముచ్చట కోసం పిల్లల నుండి తల్లిదండ్రులను పొందే హక్కులను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. పిల్లలంటే ఇష్టమే కాని, భార్య వద్దు లేదా భర్త వద్దు! భార్యాభర్త అనే రెండు చక్రాలపై నడవాల్సిన కుటుంబం, కుంటుకుంటూ బ్రతుకు జీవుడా అని ముందుకు సాగుతుంది.

# కాల గమనం




**కాలాన్ని కొనలేం..!**

**ఈ పుస్తకం ఎలా ఉందంటే చెప్పగలం...**

**కంప్యూటర్ ఎలా ఉంటుందంటే చూపగలం...**

**ఆ భవనం ఇలా ఉంటుందని వివరించగలం...**

**మరి, రేపు ఎలా ఉంటుంది?**

**పోలంకి విజయభాస్కర్**

ఈ ప్రశ్నకు సమాధానం ఎవరూ చెప్పలేరు, ఎక్కడా వివరించలేదు. ఎందుకంటే... అదొక్కటే అనంత శక్తి సంపన్నం కాబట్టి. ఆ కాలానికంటే ముందు పరుగెత్తికెళ్ళి అదెక్కడికెళుతుందో తెలుసుకోవడం మాత్రం సాధ్యంకాదు. అదో అనంత వాహిని. ఎక్కడ పుట్టిందో... ఎప్పుడు పుట్టిందో... అంతుచిక్కని ఓ మహా ప్రవాహమది.

విశ్వంలో మహత్తరమైంది ఏదంటే అది కాలమే. కాలాన్ని ప్రవాహంతో పోల్చారు. కాబట్టి అది 'కాల ప్రవాహం' అని కూడా చెప్పవచ్చు. కాల ప్రవాహాన్ని ఆపటం ఎవరి తరమూ కాదు. దాన్ని సృష్టించిన సృష్టికర్తకు తప్ప. అందుకే కాలం ఎవరి కోసమూ ఆగకుండా వెనుకకు తిరిగి చూడకుండా నిరంతరం ముందుకే సాగిపోతుంది. కాలం అంటే రేయింబవళ్ళ పరిభ్రమణం అని చెప్పవచ్చు. అంటే ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రేయి, నడిరేయి, తెల్లవారుజాము, నిన్న, నేడు, రేపు లేదా గతం, వర్తమానం, భవిష్యత్తులు. అలాగే నిమిషాలు, గంటలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు... ఇంకా యుగయుగాలు అంటూ కాలానికి మరెన్నో పేర్లున్నాయి. కాలాన్ని మాత్రం ఎంత ధనం ధారపోసినా, ఎంత పలుకుబడి ఉపయోగించినా సాధించలేము. గడిచిన కాలం... అది రెప్పపాటైనా సరే కోట్లు కుమ్మరించినా మనకు లభించదు.

సమయాన్ని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోగలిగినప్పుడే అది మనకు ఉపకరిస్తుంది. లేకపోతే అది మనల్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసి ముందుకు సాగిపోతుంది. అందుకని మనం ఏ విషయంలో అయినా సకాలంలో స్పందించగలగాలి. సమయం మించిపోయిన తరువాత తీరిగ్గా విచారిస్తే ప్రయోజనం ఉండదు. అవకాశాలు ఎప్పుడూ మన కోసం నిరీక్షిస్తూ ఉండవు. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. మనమే వాటిని అందిపుచ్చుకోవాలి. అవి మన వద్దకు రావాలని ఆశించడం కరెక్ట్ కాదు. ఎప్పుడు ఏది అవసరమో దానిపై దృష్టి కేంద్రీకరించాలి. బాధ్యతల నిర్వహణలో అలసత్వాన్ని ఎంత మాత్రం దరి చేరనీయకూడదు.

కాలం అత్యంత చైతన్యవంతమైంది. దాని విలువ తెలుసుకోకుండా బద్ధకంగా కూర్చుంటే అది మన కోసం ఆగదు. ✤

**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**




## దళిత స్కాలర్లపై మూక దాడి

మహారాష్ట్రలో కాషాయ గుండాలు రెచ్చిపోయారు. నిరవధిక దీక్షలో ఉన్న దళిత స్కాలర్లపై దాడికి దిగారు. 'జై శ్రీరామ్' నినాదాలు చేసుకుంటూ వారిని పిడిగుద్దులు గుద్దారు. కులం పేరుతో దూషించారు. ఈ తతంగాన్ని చిత్రీకరిస్తున్న ఇతర విద్యార్థుల మొబైల్ ఫోన్లను లాక్కొని బెదిరించారు. మహాత్మాగాంధీ అంతర్రాష్ట్రీయ హిందీ విశ్వవిద్యాలయ (ఎంజిఎహెచ్‌వి)లో ఈ ఘటన చోటు చేసుకున్నది. తన పిహెచ్‌డి థీసిస్‌ను మూల్యాంకనం చేయాలనే డిమాండ్‌తో దళిత స్కాలర్ రాజ్‌నీశ్ అంబేద్కర్ ఈ నిరసనను చేస్తున్నాడు. పీహెచ్‌డీ స్కాలర్ అయిన రాజ్‌నీశ్ కుమార్ అంబేద్కర్‌తోపాటు అతని సహ విద్యార్థులు ఐదు రోజుల నిరసన దీక్షలో ఉన్నారు. రజ్‌నీశ్‌తో పాటు ఇతర విద్యార్థులపై కాషాయ మూక దాడికి తెగబడింది. 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేసింది. ఐదు రోజుల దీక్షను భగం చేయాలని యత్నించింది. నిరసన చేస్తున్న విద్యార్థులపై ఇష్టం వచ్చినట్టు భౌతిక దాడికి దిగింది. ఇష్టం వచ్చినట్టు కొట్టింది. అక్కడ నిశబ్దంగా ఉన్న వాతావరణాన్ని హింసాత్మకంగా మార్చింది. గూండాలు కులం పేరుతో ఇష్టం వచ్చినట్టుగా దూషించారు. ఈ దాడిని తమ మొబైల్ ఫోన్‌లలో చిత్రీకరిస్తున్న ఇతర విద్యార్థులను దుండగులు బెదిరించారు.

## విచారణలు త్వరగా ముగించాలి

జైళ్ళు కిక్కిరిసిపోతున్నాయని, అక్కడ జీవన పరిస్థితులు అత్యంత దుర్భరంగా, దయనీయంగా ఉంటాయని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. సకాలంలో విచారణలు ముగించని పక్షంలో, వ్యక్తులకు జరిగే అన్యాయం, నష్టం అపారంగా వుంటుందని సుప్రీం పేర్కొంది. నార్కొటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ యాక్ట్ కింద అభియోగాలు మోపబడిన వ్యక్తికి బెయిల్‌ను పొడిగిస్తూ జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, దీపాంకర్ దత్తాలతో కూడిన బెంచ్ పై వ్యాఖ్యలు చేసింది. "నిందితుడు బలహీనమైన ఆర్థిక వర్గాలకు చెందినవాడైతే సుదీర్ఘకాలం నిర్బంధంలో వుంచడం వల్ల వెంటనే జీవనోపాధి కోల్పోవడం, అనేక కేసుల్లో కుటుంబాలు చెల్లాచెదురు కావడం, కుటుంబసభ్యుల మధ్య బంధాలు విచ్ఛిన్నమవడం, సమాజం నుండి వేరుపడడం వంటి అనేక హానికరమైన ప్రభావాలు తలెత్తుతాయి. అందువల్ల, న్యాయస్థానాలు ఇటువంటి అంశాలకు సంబంధించి సున్నితంగా వ్యవహరించాల్సి వుంటుంది. విచారణలను వేగంగా చేపట్టి ముగించాల్సి వుంటుంది" అని బెంచ్ పేర్కొంది. బెయిల్ మంజూరయ్యే నిబంధనలను కఠినంగా రూపొందించడం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మంచిదే కావచ్చు, కానీ సకాలంలో విచారణ జరగకపోతే సంభవించే నష్టం అపారంగా వుంటుందని హెచ్చరించింది.

## కర్ణాటకలో మూక హత్య

డిమాండ్ చేసిన రూ.2 లక్షలు ఇవ్వనందుకు ఒక ముస్లిం వ్యక్తిని గో సంరక్షకులు కొట్టి చంపారు. బీజేపీ పాలిత కర్ణాటకలో ఈ దారుణం జరిగింది. పశువుల వ్యాపారి ఇద్రిస్ పాషా, ఒక వాహనంలో పశువులను తరలిస్తున్నాడు. పునీత్ కెరెహళ్లి నేతృత్వంలోని ఆవు సంరక్షకులు ఆ ముస్లిం వ్యక్తిని అడ్డుకున్నారు. అయితే పశువుల సంత నుంచి కొన్న వాటిని తరలించేందుకు అనుమతి ఉన్న పత్రాలను ఇద్రిస్ పాషా వారికి చూపించాడు. అయినప్పటికీ పునీత్, అతడి అనుచరులు రూ.2 లక్షలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించిన ఇద్రిస్ పాషాను గో రక్షకులు దారుణంగా కొట్టి చంపారు. గో సంరక్షకులు పునీత్, అతడి అనుచరులపై హత్యతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## మేలో కర్ణాటక ఎన్నికలు

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు మే 10న నిర్వహించనున్నారు. అదే నెల 13న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ ప్రకటించారు. దీంతో రాష్ట్రంలో వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 224 అసెంబ్లీ సీట్లున్న కర్ణాటకలో ప్రస్తుతం బీజేపీకి 119, కాంగ్రెస్‌కు 75, జేడీఎస్‌కు 28 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నది. రెండు సీట్లు ఖాళీగా ఉన్నాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలతోపాటు పలు రాష్ట్రాల్లో ఖాళీ అయిన స్థానాల్లో ఉప ఎన్నికలకు కూడా ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. పంజాబ్‌లోని జలంధర్ పార్లమెంటు స్థానం, ఒడిశాలోని జర్సుగూడ, ఉత్తరప్రదేశ్‌లోని సార్, ఛన్‌బీ, మేఘాలయలోని సోహియాంగ్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నది.

### బీజేపీ మత హింస రాజకీయాలు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మత ఘర్షణలను బీజేపీ పావుగా ఉపయోగించనున్నదని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, గుజరాత్‌లో ఇటీవల జరిగిన ఘర్షణలు అందుకు 'ట్రైలర్' అని ట్వీట్‌లో తెలిపారు. విద్వేష ప్రసంగం, మైనారిటీలకు ఎర వేయడం.. ఈడీ, సీబీఐ, ఈసీలను ఉపయోగించి విపక్షాలను వేధించడాన్ని బీజేపీ పావులుగా వాడుకోవాలనుకుంటున్నదని వెల్లడించారు. బెంగాల్‌ను దహనం చేయడం, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లో మత హింసకు ఆజ్యం పోయడం అందుకు ట్రైలర్ అని సిబల్ పేర్కొన్నారు.




## లోకల్ కరెన్సీ వైపు మొగ్గుచూపుతున్న ఏషియన్ దేశాలు

ఆగ్నేయాసియా (ఏషియన్) దేశాలు ఈ ప్రాంతంలో స్థానిక కరెన్సీ వాడకం వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయి. డాలర్ వంటి ప్రధాన అంతర్జాతీయ కరెన్సీలపై ఆధారపడడం వల్ల గ్లోబల్ సంక్షోభంలో తాము కూడా కూరుకుపోయే ప్రమాదముందని ఈ దేశాలు గ్రహించాయి. అందుకే డాలర్ల వాడకాన్ని వీలున్నంత మేరకు వాడకుండా ఉండాలని నిర్ణయించుకున్నాయి. బాలిలో జరిగిన ఏషియాన్ దేశాల ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంకు గవర్నర్ల సమావేశంలో ఈ మేరకు తీర్మానించుకున్నట్లు ఇండోనేషియా సెంట్రల్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశానికి ఇండోనేషియా ఈసారి అధ్యక్షత వహించింది.

## రమజాన్ పది రోజుల్లో 74 లక్షల మంది మస్జిదె హరామ్‌ను సందర్శించుకున్నారు

రమజాన్ మాసం తొలి దశకంలో 74 లక్షల మంది యాత్రికులు మస్జిదె హరామ్‌ను సందర్శించారని మస్జిదె హరామ్ వ్యవహారాల శాఖ వెల్లడించింది. గత రెండు సంవత్సరాలుగా కరోనా కారణంగా పరిమిత సంఖ్యలోనే సందర్శకులు వచ్చేవారు. కాని ఇప్పుడు పూర్తిగా ఆంక్షలు తొలగించడంతో రమజాన్లో ఉమ్రా చేసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయిందని తెలిపింది.

## నాలుగేళ్ళలో పుస్తకం రాసి గిన్నిస్ రికార్డుకెక్కిన సయీద్ రషీద్

అక్షరాలు దిద్దే నాలుగేళ్ళ వయసులోనే ఒక బాలుడు పుస్తకం రాసి అతి పిన్న వయస్కుడైన రచయితగా రికార్డు సాధించాడు. అతని పేరు సయీద్ రషీద్ అల్ మహీరీ. అబూ జబీకి చెందిన అబ్బాయి. పుస్తకాలు రాయడం అంటే అతనికి చాలా మక్కువ. అతను The Elephant Saeed and the Bear అంశంపై పుస్తకం రాశాడు. సయీద్ మార్చి 9, 2023న ప్రపంచ రికార్డును సృష్టిం చాడు, ఆ తర్వాత సయీద్ పుస్తకం 1000 కాపీలు అమ్ముడ య్యాయి. 8 ఏళ్ళలో పుస్తకం రాసి రికార్డు సాధించిన తన అక్కను స్ఫూర్తిగా తీసుకుని సయీద్ కూడా పుస్తకాలు రాయడం మొదలు పెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు.

## సిరియాలో అమెరికా రెచ్చగొట్టే చర్యలు

సిరియాలో అమెరికా బలగాలు రెచ్చగొట్టే చర్యలకు దిగడాన్ని రష్యా అభ్యంతరం వ్యక్తం చేసింది. అమెరికా చర్యలకు రష్యా నిరసన వ్యక్తం చేసినట్లు ఆ దేశ వార్తా సంస్థ టిఎఎస్ఎస్ వెల్లడిం చింది. సిరియా ఈశాన్య ప్రావిన్స్ హస్కాకేలో సిరియా సైనిక దళాలను రెచ్చగొట్టేలా అమెరికా సైనిక దళాలు మోహరించాయని రష్యా సైనిక సీనియర్ అధికారి అడ్మిరల్ ఒలెగ్ గుర్నివో మీడియాకు వెల్లడించారు. అమెరికా దళాలు తమ జోన్‌ల వెలుపలికి రెండు సార్లు వచ్చినట్లు తాము గుర్తించామని గుర్నివో తెలిపారు. కాగా, అమెరికా సైనిక చర్యలను సిరియా మంత్రిత్వ శాఖ విమర్శించింది. అమెరికా చేసే క్రూరమైన దాడు లను తాము తిప్పికొడతామని, యుఎస్ ఆక్రమణను అంతం చేస్తామని సిరియా మంత్రిత్వశాఖ వెల్లడించింది.

## మొక్కలు ఏడుస్తాయా?

చెట్లు కూడా మనలా మాట్లాడతాయని, బాధ కలిగితే ఏడుస్తా యని చెప్తున్నారు శాస్త్రవేత్తలు. మొదటిసారిగా మొక్కల ఏడుపును అల్ట్రాసోనిక్ మైక్రోఫోన్స్‌తో రికార్డు చేశారు ఇజ్రాయిల్‌లోని టెల్అవీవ్ శాస్త్రవేత్తలు. ఎలాంటి సమస్య లేని మొక్కలు సగటున గంటకు ఒకసారి కంటే తక్కువసార్లు శబ్దం చేయగా, నీరందని, గాయాలకు గురైన మొక్కలు గంటకు డజన్ల సార్లు శబ్దాలు చేశాయి' అని ఈ అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్త లిలచ్ హడనీ తెలిపారు. మొక్కల నుంచి వచ్చే శబ్దాలను రికార్డు చేసి విశ్లేషిం చారు. ఈ వివరాలు 'సెల్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మొక్కల నుంచి 'క్లిక్' లాంటి శబ్దాలు వస్తాయని, ఇది పాప్‌కార్న్ కొరికినప్పుడు వచ్చే శబ్దంతో పోలి ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తిం చారు. అయితే, మన చెవులు ఈ శబ్దాలను వినలేవని తెలిపారు. టమాట, పొగాకు మొక్కలపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టినప్పటికీ గోధుమ, మొక్కజొన్న వంటి మొక్కల నుంచి శబ్దాలను రికార్డు చేశారు.

## జపాన్ జనాభా తంటాలు

జనాభాను పెంచడానికి జపాన్ ప్రభుత్వం నానాతంటాలు పడుతున్నది. పెద్ద ఎత్తున సబ్సిడీలు, నగదు ప్రయోజనాలు అందిస్తామని, వేతనాల పెంపుదల అమలుజేస్తామని, వివాహం చేసుకొని, పిల్లల్ని కనాలంటూ కార్మికరంగంలోని యువతను కోరుతున్నది. ఇందుకు సంబంధించి తాజాగా ప్రతిపాదనలను ఆ దేశ ప్రభుత్వం సిద్ధం చేసింది. దేశంలో ఈ తరహా పరిస్థితి ఇంతకుముందెన్నడూ లేదని తెలిపారు. జనన రేటు పెంచేం దుకు ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసిందని వెల్లడించారు. పిల్లల పెంపకానికి, వారి విద్యలో ఇప్పుడున్న సబ్సిడీలను మరింత పెంచాలని, వివాహం చేసుకొని పిల్లలను కనే యువతకు వేతనాలు పెంచాలని ప్రభుత్వం తాజా ప్రతిపాదనల్లో పేర్కొన్నది.

## అక్కడ ఇంగ్లీష్ మాట్లాడితే రూ.90 లక్షల జరిమానా

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అధికారిక వ్యవహారాల్లో ఇంగ్లిష్‌ను వాడకుండా నిషేధించాలని ఇటలీలోని అధికార పార్టీ ఓ బిల్లును రూపొందించింది. ముఖ్యంగా ఇటాలియన్ భాషను ప్రోత్సహించ డానికే ఈ బిల్లు రూపొందించినట్టు తెలిపింది. ఉల్లంఘిస్తే రూ.90లక్షల వరకు జరిమానా విధించాలని ఆ బిల్లులో ఉన్నది.

# విలువల వికాసమే ఉపవాసాల ఉద్దేశ్యం



- యండి. ఉస్మాన్ ఖాన్

**అల్లాహ్** ఈ సృష్టిని ఉనికిలోకి తెచ్చినప్పుడే దానికి కొన్ని ప్రత్యేకతలను ప్రసాదించాడు. కొన్నిటికి కొన్నింటిపై ఆధిక్యాన్ని అనుగ్రహించాడు. ఆకాశాన్ని గ్రహాలు, నక్షత్రాలతో, వాతావరణాన్ని పక్షులు, మేఘాలతో, భూమిని పచ్చని బయళ్ళు, పొదలు చెట్లతో, చెట్లను రకరకాల, రంగురంగుల పూలు, పళ్ళు, ఆకులతో అలంకరించాడు. భూమి నలుమూలలను మక్కా, మదీనా, బైతుల్ మఖ్దిస్ లాంటి పవిత్ర స్థలాలతో పునీతం గావించాడు. రోజుల్లో శుక్రవారానికి, రాత్రుల్లో షబేఖద్ర్‌కు, గ్రంధాల్లో పవిత్ర ఖురానుకు, నెలల్లో రమజాన్ నెలకు, రమజాన్‌లో రోజాలకు ప్రత్యేకతను ప్రసాదించాడు. ఇదే నెలలో పవిత్ర గ్రంధాన్ని అవతరింపజేశాడు. అందుకే రమజాన్ నెల నిస్సందేహంగా మిగతా నెలలన్నిటికంటే అగ్రగామిగా నిలిచింది. అదేవిధంగా అల్లాహ్ ప్రపంచంలో, విభిన్న రుతువుల్ని రూపొందించాడు. చలికాలం, వేసవికాలం, వానాకాలం ఇలా... రకరకాలుగా కాలాన్ని విభజించాడు. కూరగాయలు, పళ్ళుఫలాలు, ధాన్యం, అపరాలు తదితర పంటలకూ విభిన్న రుతువుల్ని రూపొందించాడు.

ఇదేవిధంగా, విశ్వాసుల కోసం ప్రత్యేకంగా పవిత్ర రమజాన్ రుతువును ఉనికిలోకి తెచ్చాడు. బుద్ధిమంతులు, తెలివైన వాళ్ళు ఆయా రుతువు (సీజన్) ల ద్వారా లబ్దిపొందుతారు. మిగతా కాలమంతా చీకూచింత లేకుండా హాయిగా గడిపేస్తారు. ఇదే విధంగా విశ్వాసులకు రమజాన్ రుతువు భయభక్తుల రుతువు. ఎవరైతే ఈ రుతువు ద్వారా లబ్దిపొందుతారో వారే మిగతా పదకొండు నెలల కాలం దైవాదేశపాలనలో విలువలతో కూడిన జీవితం గడపగలుగుతారు. ఒక వ్యాపారి మంచి వ్యాపార సీజన్‌లో, ఒక రైతు వ్యవసాయ తరుణంలో ఏమరుపాటుకుల్లోనై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా నష్టపోతాడో అలాగే విశ్వాసులు కూడా రమజాన్ రుతువును నిర్లక్ష్యం చేస్తే తీవ్రంగా నష్టపోతారు. ఇహపరాల వైఫల్యం మూటగట్టుకుంటారు. నిజానికి ఇది కాస్తంత శ్రమ చేసి అనంతమైన లాభం పొందే తరుణం. చిత్తశుద్ధి ఆధారంగా అనూహ్యమైన ప్రతిఫలం లభిస్తుంది. ఇంతమంచి శుభతరుణాన్ని పొంది, దానిద్వారా ప్రయోజనం పొందలేనివారు నిజంగానే దురదృష్టవంతులని చెప్పాలి. ఎవరైతే రమజాన్ నెలను పొంది, ఉపవాసాలు పాటించలేదో, పాపక్షమాపణకు ప్రయత్నించలేదో అలాంటివారిపై దేవుని శాపం విరుచుకు పడుతుందని ప్రవక్త మహనీయులు హెచ్చరించారు.

రమజాన్‌ను గౌరవించని వారిని, రమజాన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని జిబ్రీల్ దూత శపించారు. ముహమ్మద్ ప్రవక్త(స) దానికి ఆమీన్ (తథాస్తు) పలికారంటే దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. అందుకని రమజాన్‌ను గౌరవించాలి. అత్యంత భక్తిశ్రద్ధలతో నియమానుసారం ఆరాధనలు చేయాలి. రోజు ఐదుపూటల నమాజుతోపాటు, రాత్రి 'తరావీహ్' (ఖియాముల్లైల్) ఆచరించాలి. పవిత్ర ఖురాన్ గ్రంధాన్ని భక్తితో పారాయణం చెయ్యాలి. దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. ప్రతి రమజాన్‌లో జిబ్రీల్ అలైహిస్సలాం ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం వారికి ఖురాన్ చదివి వినిపించేవారు. ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం జిబ్రీల్ వారికి ఖురాన్ చదివి వినిపించేవారు. దేవుని దూత, దేవుని ప్రవక్త ఈ విధంగా పరస్పరం ఒకరికొకరు ఖురాన్ చదివి వినిపించుకునే వారంటే పవిత్ర గ్రంధ ప్రాముఖ్యతను మనం అర్థం చేసుకోవాలి. ఈ నెలలో సాధ్యమైనంత అధికంగా దానధర్మాలు చేయడానికి ప్రయత్నించాలి. ఉన్నంతలోనే పేదసాదలను ఆదుకోవాలి. పేద బంధువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. వారి కష్టనష్టాలను విచారించాలి. సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి. మొత్తం మీద జీవితాన్ని నిండు మానవీయ విలువలతో గడిపేలా తీర్చిదిద్దడమే రమజాన్ ఉపవాసాల పరమోద్దేశ్యం.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**